మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# పోలీస్‌శాఖ విధులు అత్యంత బాధ్యతాయుతమైనవి..

### అంకిత భావంతో పనిచేయాలి;జిల్లా ఎస్పీ వెంకటేశ్వర్లు

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 29 ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ వెంకటేశ్వర్లు గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా మక్తల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ముందుగా పోలీస్ స్టేషన్‌లోని సిబ్బంది పరేడ్‌ను పరిశీలించి సిబ్బంది యూనిఫామ్ నిట్ టర్న్ అవుట్‌ను చెక్‌చేసి సిబ్బంది మంచి క్రమశిక్షణ కలిగి ఉండి సమయపాలన పాటించాలని తెలిపారు.



అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి సిబ్బంది నివాసానికి యోగ్యంలేని పోలీస్ క్వటర్స్‌ని, పరిసరాలను క్లీన్ చేయించి మొక్కలు నాటాలని సూచించారు. పోలీస్ సిబ్బందితో కలిసి పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. మక్తల్ టౌన్‌లో పాత సిసి కెమెరాలతో పాటు హై క్వాలిటీ ఉన్న నూతనంగా 24 సిసి కెమెరాలను ఎస్పీ ప్రారంభించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, దర్యాప్తు వివరాలను ఎస్సై పర్వతాలు, సిఐ సీతయ్యలను అడిగి తెలుసుకున్నారు. – మిగతా2లో..

# నేరాల అదుపులో వనపర్తి జిల్లా పోలీసు భేష్..

### జిల్లాలో తగ్గిన రోడ్డు ప్రమాదాలు, నేరాలు: జిల్లా ఎస్పీ అపూర్వరావు

**వనపర్తి క్రైమ్,డిసెంబర్ 29 ప్రభాతవార్త:** నేరాలు, రోడ్డు ప్రమాదాలు నియంత్రించడంలో వనపర్తి జిల్లా పోలీసులు విజయం సాధించారని వనపర్తి జిల్లా ఎస్పీ కె.అపూర్వరావు వార్షిక సమావేశం ద్వారా వనపర్తి జిల్లా వార్షిక నివేదికను ఎస్పీ ప్రకటించారు. గత ఏడాది కన్నా ప్రస్తుత సంవత్సరంలో నేరాల సంఖ్య ఘననీయంగా తగ్గిందని ఇందులో హత్యలు, దోపిడీలు, దొంగతనాలు, మహిళలపై దాడులు, చైన్ స్నాచింగ్‌లు నియంత్రించడంలో వనపర్తి జిల్లా పోలీసులు ముందున్నారు.



రోడ్డు ప్రమాదాలకు సంబందించి పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరంలో ప్రమాదాలు గణనీయంగా తగ్గాయని ఎస్పీ సమావేశంలో తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు సంబందించి జిల్లాలో 73 కేసులు నమోదు చేసి 113 మందిని అరెస్టు చేయడం జరిగిందని, జిల్లాలో ఈ-పెట్టి కేసులు 2031 కేసులు నమోదు చేశారని, జిల్లాలో ఓపెన్ సిట్టింగ్ చేసిన 166మంది పై కేసులు నమోదు చేశామని ఆమె తెలిపారు. మైనర్ డ్రైవింగ్ చేసి వాహనాలు నడిపిన – మిగతా2లో..

# ఎన్నాళ్లీ.. కష్టాలు..!

- పెరగని వేతనంతో తప్పని పాట్లు...
- పెరిగిన ధరలు,కనికరించని అధికారులు... పట్టించుకోని ప్రభుత్వం...
- నష్టాల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులు



పిల్లలకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న వంట నిర్వాహకులు

రోజు వారి కూలీల కంటే వారికి ఇచ్చే వేతనం కన్నీటిని మిగులుస్తోంది. పాలకులు కరుణిస్తే కష్టాలు పోతాయని, ఏళ్ల తరబడి వెట్టి చాకిరీ చేస్తున్నారు. కానీ వారు పడుతున్న శ్రమను ప్రభుత్వం గుర్తించకపోవడంతో వారి బ్రతుకు కష్టాల్లో సుడిగుండంలో మునిగిపోతుంది. ప్రభుత్వం అన్ని రంగాల వారిని గుర్తించి వేతనం ఇస్తున్న వీరిని మాత్రం కనుకరించడం లేదు. దీంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు చాలీ చాలని కూలితో పాలకుల కరుణ కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్న మహిళలు ఎన్నో ఏళ్లుగా వెట్టి చాకిరీ చేస్తున్నారు. ప్రభుత్వం వీరికి ఇస్తున్న చాలీ చాలని వేతనం, వంట గ్యాస్ సరఫరా లేక పాత్రలు ఇవ్వక నిత్యావసర ధరల పెరుగుదలకు అనుగుణంగా ఇవ్వకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. తమకు కనీస వేతనం ఇవ్వాలని, బిల్లులు పెంచాలని ఎన్నో ఏళ్లుగా వేడుకుంటున్న కూడా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. వంగూరు మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే. వీరందరికి మండలంలో 39 పాఠశాలలు ఉండగా...65 మంది వంట మహిళలు ఉన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహిస్తూ 2960 మంది విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు.

***వంగూరు, డిసెంబర్ 29, ప్రభాతవార్త:*** ఎన్నో ఏళ్లుగా సరిపడ తిండిలేక డ్రాప్ అవుట్ కాకుండా ఉండేందుకు గాను గత కొన్ని రోజులుగా కేంద్రప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశ పెట్టింది.1నుంచి 8వతరగతి విద్యార్థులకోసం ఈపథకం అమలుచేయగా,రాష్ట్ర ప్రభుత్వం 9,10వ తరగతి విద్యార్థులకు కూడా అమలుచేయడంతో పాటు కేంద్రం ఇస్తున్న దొడ్డు బియ్యంకు బదులుగా రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం సరఫరా చేస్తుంది.పాఠశాలల్లో ఈపథకాన్ని అమలు చేసే బాధ్యతను మహిళా సమాఖ్య సంఘాలకు అప్పగించింది. ముగ్గురు మహిళలు కలిసి భోజనాలను సిద్ధం చేసి వడ్డిస్తున్నారు. ప్రభుత్వం కేవలం బియ్యం మాత్రమే సరఫరా చేస్తుండగా నిర్వాహకులు వ మా త్ర ం మెనుప్రకారం చేసే వంటలకు తరగతుల వారిగా బిల్లులు చెల్లిస్తుంది. వారానికి రెండు సార్లు ఉడకబెట్టిన గుడ్లు విద్యార్థులకు అందించాల్సి ఉంది.మార్కెట్‌లో ఒక గుడ్డుధర రూ.6లు పలుకుతున్న ప్రభుత్వం మాత్రం రూ.4లు మాత్రమే చెల్లిస్తుంది. రోజురోజుకు నిత్యావసర సరకులకు కూరగాయల ధరలు పెరుగుతుండటంతో ప్రభుత్వం ఇస్తున్న బిల్లులు మాత్రం సరిపోవడం లేదని మహిళలు చెబుతున్నారు.ఈ పథకం ఆరంభమైన తర్వాత ఒక్కొవర్కర్‌కు నెలకు రూ.1000లు చెల్లిస్తోంది. సుమారు 15 సంవత్సరాలు గడుస్తున్న కూడా అంతే గౌరవ వేతనాలు అందిస్తున్నారని ఒక్కరూపాయి కూడా పెంచడం లేదని, బయట రోజుకు కూలికి పోతే సుమారు రూ.400లు అందిస్తున్నారని, ఈ లెక్కన చూసుకుంటే రూ.10 నుంచి 12 వేల వరకు సంపాదించుకోవచ్చునని చెబుతున్నారు. ఉపాధి పని కూలీకి వెళ్లిన రూ.200లు వస్తాయని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం తమతో వెట్టి చాకిరిలు చేయిస్తూ తమకు వేతనం ఇవ్వడం లేదని, వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెరగడంతో కట్టెలపై వంటలు చేస్తుండటంతో ఎంతో మంది అనారోగ్యం భారిన పడుతున్నారు. వంట పాత్రలను కూడా సరఫరా చేయడం లేదని, దీంట్లో ఇంట్లో ఉన్న సామాగ్రితోనే భోజనాలు తయారు చేస్తున్నారు. ప్రభుత్వం 5వ తరగతి పిల్లల వరకు రూ.4.97పైసలు, 8వ తరగతి పిల్లలకు రూ.7లు ఖర్చు చేస్తుంది. పిల్లలకు ఖర్చు చేస్తున్న పైకంపై కూడా సరైన పోషకాలు అందడం లేదు. పెరిగిన ధరల ప్రకారం కూడా పైకం అందడం లేదు. దీంతో పిల్లలకు, నిర్వాహకులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వాలు ఇప్పటికైన స్పందించి వంట నిర్వాహకుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని కనీస గౌరవ వేతనం అందించాలన్నారు.



పిల్లలకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న వంట నిర్వాహకులు

# మద్దిగట్ల హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణంలో.. అవినీతి జబ్బు..!

**నాణ్యతలేని ఇసుక వినియోగంపై ముక్కున వేలేసుకుంటున్న గ్రామస్తులు.. ప్రభుత్వ నిధుల దుర్వినియోగం పై సర్వత్ర విమర్శలు..**



భవన నిర్మాణానికి నాణ్యతలేని ఇసుకను ఉపయోగిస్తున్న దృశ్యం

**పెద్దమందడి,డిసెంబర్ 29 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మద్దిగట్ల గ్రామంలో వైద్యశాఖ కు సంబందించిన సబ్ సెంటర్ నిర్మాణంలో కాంట్రాక్టర్ కు అవినీతి జబ్బు అలుముకుంది. నాణ్యతలేని ఇసుక వినియోగం పై గ్రామస్తులు ముక్కు పై వేలేసుకుంటున్నారు. గ్రామ సమీపంలోని వాగులోని నాణ్యతలేని ఇసుకను జేసీబీ తో తోడిపోసి భవన నిర్మాణానికి ఉపయోగించడంపై గ్రామంలో సర్వత్ర విమర్శలు వెల్లువెత్తున్నాయి. ప్రభుత్వ నిధులను వినియోగించి చేపడుతున్న ఈ భవన నిర్మానంలో నాణ్యతలేని మెటీరియల్ ను ఉపయోగించడంపై పంచాయితీరాజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ – మిగతా2లో..

# గ్రామ గ్రామాన పల్లె దవాఖానా..!

### ఆరోగ్య తెలంగాణగా మార్చడమే సీఎం కెసిఆర్ లక్ష్యం

**మల్దకల్,డిసెంబరు 29 ప్రభాతవార్త :** మల్దకల్ మండల పరిధిలోని పాల్వాయి, ఎల్కూర్, విఠలాపురం గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పల్లె దవాఖానాను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ సరితలు హాజరై గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యేకు సర్పంచ్‌లు, నాయకులు శాలువా, పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో గ్రామీణ ప్రాంతాల్లో సరైన మౌలిక సదుపాయాలు లేక వైద్య సదుపాయాలు లేక పేద ప్రజలు ఆరోగ్య పరంగా ఇబ్బందులకు గురయ్యేవారన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన ఆపరేషన్ల కొరకు ఇక్కడి నుండి కర్నూల్‌కు, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లి చికిత్సను పొందేవారు. వీరిలో కొంతమంది మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయేవారన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో సీఎం కెసిఆర్, ప్రజలందరు ఆరోగ్యంగా ఉండాలని వైద్యాలయానికి పెద్దపీట వేసి వైద్యారోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు నేతృత్వంలో కరోనా సమయంలో కూడా అన్ని రకాల వైద్యం అందజేశారన్నారు. డయాలసిస్ పేషెంట్లకు ప్రత్యేకంగా చికిత్స అందించడం జరిగిందన్నారు. అన్ని రకాల



పల్లె దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

# జడ్చర్ల అగ్రికల్చరల్ మార్కెట్ పాలకమండలి ప్రమాణ స్వీకారం..!

### ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**రాజాపూర్,డిసెంబరు 29 ప్రభాతవార్త :** జడ్చర్ల వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో జడ్చర్ల మార్కెట్ కమిటి నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎఎంసి ఛైర్మన్‌గా ఎం.గోవర్ధన్‌రెడ్డి, వైస్ ఛైర్మన్‌గా దానిష్, ఇతర పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ పాలనలో రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ ముందుకు పోతున్న తరుణంలో రైతులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ రైతుబంధు, రైతుభీమా, ఉచిత కరెంటు, సాగునీరు సకాలంలో ఎరువులు లాంటి అనేక రకాల పథకాలను చేపట్టి రైతును రాజు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని అన్నారు. మార్కెట్ యార్డును మరింత బలోపేతం చేస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రైతులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తూ పదవి కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేసిన కొత్త పాలక మండలి సభ్యులకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



పాలకమండలిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

# కంటి వెలుగు కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి..

### వనపర్తి జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష

**వనపర్తి ప్రతినిధి,డిసెంబర్ 29 ప్రభాతవార్త:** జనవరి 18 నుండి కంటి వెలుగు కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎజెండా అంశాలైన కంటి వెలుగు, క్రీడా ప్రాంగణం తెలంగాణకు హరితహారం అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టరన మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా అర్బన్ 450, రూరల్ 350మంది కంటి రోగులు వచ్చేలా చూడాలని ప్రతి ఒక్కరు ఆధార్ కార్డు తీసుకోని రావాలని అన్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారు కంటి పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. పంచాయితీ కార్యదర్శులు టెంట్లు, టాయిలెట్లు, కరెంటు సరఫరా జరిగేలా చూడాలని అన్నారు. ఉదయం 8గంటల నుండి సాయంత్రం5 వరకు డాక్టర్లు, వైద్య సిబ్బంది క్యాంపులలో ఉండాలి అన్నారు. మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా మొదటి దశలో 183పాఠశాలలను గుర్తించి పనులు చేస్తున్నట్లు తెలిపారు. జనవరి ఏడులోగా మండలానికి రెండు పాఠశాలల పనులు పూర్తి చేసి ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దాలని అన్నారు. కంపౌండ్ వాల్ ఇతర నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఎన్ఆర్ఈజీఎస్ కింద పెయింటింగ్ వేయాలని అన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటాలని అన్నారు. జిల్లాలో చేపట్టిన క్రీడా ప్రాంగణాల పనులు సరిగా పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్, ఆర్డీఓ పద్మావతి, జడ్పీ సీఈఓ వెంకట్ రెడ్డి, ఈఈ పీఆర్ మల్లయ్య, డీఈఓ రవీందర్, ఎంఈఓలు, డీఎంహెచ్ఓ రవిశంకర్, డీపీఓ సురేష్ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జనవరి 18 నుండి కంటి వెలుగు
# కార్యక్రమ నిర్వహణకు సంసిద్ధంగా ఉండాలి

- కంటి వెలుగు, కోవిడ్‌పై త్వరలోనే మంత్రి ఆధ్వర్యంలో జిల్లా సమన్వయ సమావేశం
- కోవిడ్ కొత్త వేరియంట్ వల్ల భయపడాల్సిన అవసరం లేదు, అందరు జాగ్రత్తగా,అప్రమత్తంగా ఉండాలి
- మాస్కులు, శానిటైజర్, సోషల్ డిస్టెన్స్ పాటించాలి
- కోమార్బిడిటి ఉన్న వారందరికి వెంటనే కోవిడ్ బూస్టర్ డోస్ వ్యాక్సిన్ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 29 ప్రభాతవార్త :** గురువారం జిల్లా కలెక్టర్ కంటి వెలుగు కోవిడ్ వ్యాక్సిన్ బూస్టర్ డోస్, తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలు, ధరణి తదితర అంశాలపై వైద్య ఆరోగ్య శాఖ జిల్లా, మండల స్థాయి అధికారులతో పాటు, ఎంపిడిఓలు, తహసిల్దార్‌లతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జనవరి 18 నుండి కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అందరు సంసిద్ధం కావాలని కలెక్టర్ ఆదేశించారు. కంటి వెలుగు, కోవిడ్‌పై త్వరలోనే రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సమన్వయ సమావేశం నిర్వహిచండం జరుగుతుందని, జిల్లాస్థాయి సమావేశం అనంతరం మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని, స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేసి ఈ రెండు కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని 100 రోజులు నిర్వహించడం జరుగుతుందని ఇందుకు 45 బృందాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రతి బృందంలో ఒక వైద్యాధికారితో పాటు సూపర్‌వైజర్, ఇద్దరు ఎఎన్ఎంలు, ఆశాలు, పారామెడికల్ ఆప్తాలమిస్టు ఉంటారని తెలిపారు. 18 సంవత్సరాలు పైబడిన వారందరికి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు ఇవ్వడం జరుగుతుందని, సోమవారం నుండి శుక్రవారం వరకు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, గ్రామీణ ప్రాంతాలలో 300ల మందికి, పట్టణ ప్రాంతాల్లో 400ల మందికి గ్రామ పంచాయతీలు,పాఠశాల భవనాలలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు, జిల్లా కలెక్టర్‌కు వివరించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కోవిడ్ కేసులు నమోదవుతున్న దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా అందరు అప్రమత్తంగా ఉండాలని, భయపడాల్సిన అవసరం లేదని,జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందనే అవగాహన కల్పించాలని చెప్పారు. ముఖ్యగా కోమార్బిడిటితో బాధపడుతున్న వారిని గుర్తించి తక్షణమే వారికి బూస్టర్ డోస్ వ్యాక్సిన్ ఇవ్వాలని,అవసరమైన వ్యాక్సిన్‌ను రాష్ట్రస్థాయినుండి తక్షణం తెప్పించాలని అన్నారు. ఈ విషయంపై జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలపై జిల్లా కలెక్టర్ సమీక్షిస్తూ ఎంపిడిఓలు, తహసిల్దార్‌లు ఇంకా ఎక్కడైనా స్థలాలు గుర్తించాల్సి ఉంటే తక్షణమే గుర్తించి నివేదికలు సమర్పించాలని తహసిల్దార్,ఎంపిడిఓ నివేదికలు ఒకేలా ఉండాలని చెప్పారు. తెలంగాణకు హరితహారం కింద చేపట్టిన నర్సరీలలో రానున్న 3,4 రోజుల్లో బ్యాగులలో మట్టి నింపడం పూర్తి చేయాలని, జనవరి 7 నాటికి అన్ని బ్యాగులలో విత్తనాలు నాటడం పూర్తి కావాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి సంవత్సరం హరితహారం కార్యక్రమం నిర్వహిస్తున్నందున అధికారులు ముందుచూపుతో నర్సరీలలో మొక్కలు పెంచడాన్ని సమయానుకూలంగా పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ముఖ్యంగా టేకు మొక్కలను సిద్ధంచేయాలని, అలాగే అన్ని రకాల మొక్కలు పెంచాలని ఆదేశించారు. ధరణిపై జిల్లాకలెక్టర్ తహసిల్దార్‌లతో సమీక్షిస్తూ పెండింగ్‌లోఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని తహసిల్దార్‌లను ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. కృష్ణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. శంకర్, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు, ప్రాజెక్టు ఆఫీసర్లు, ఎంపిఓలు తదితరులు హాజరయ్యారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

# శ్రీశ్రీశ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఏ రకమైన ఇబ్బంది కలగదు

- జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్
- బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి...
- కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి



ఉత్సవాల ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 29, ప్రభాతవార్త:** ప్రాచీన పురాతనమైన ఆలయంగా తెలంగాణ రాష్ట్రంలో రెండవ యాదాద్రిగా పేరుగాంచిన సింగోటం శ్రీశ్రీశ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సింగోటం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై గురువారం సింగోటం లక్ష్మీనరసింహ్మస్వామి ఆలయ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్, స్థానిక ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిలతో కలిసి అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు చేసిన ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించి అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 15వ తేదీ నుంచి జనవరి 21వ తేదీ వరకు జరగనున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఇది వరకే ఆశించినటుగా ఆయా శాఖల అధికారులు వారికి కేటాయించిన విధులను తూచ తప్పకుండా నిర్వర్తించాలని, నిర్లక్ష్యం వహించవద్దని కోరారు. 16వ తేదీన నిర్వహించే స్వామి వారి కళ్యాణోత్సవం, 17వ తేదీన నిర్వహించనున్న ప్రభోత్సవం, 19న నిర్వహించనున్న తెప్పొత్సవం, ఉత్సావానికి అన్ని ఏర్పాట్లు చేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని ఆదేశించారు. పార్కింగ్ లైటింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి – మిగతా2లో..

# క్షతగాత్రులను పరామర్శించిన జెడ్పీటీసీ భరత్‌ప్రసాద్



**అచ్చంపేట, డిసెంబర్ 29, ప్రభాతవార్త:** అచ్చంపేట నియోజకవర్గంలోని ఉప్పునుంతల మండలంలో ప్రమాదవశాత్తు గాయపడిన రాజేందర్‌రెడ్డి, బాల్‌నారి, బాలగౌడ్, వెంకటయ్యలను గురువారం జెడ్పీటీసీల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతుగంటి భరత్‌ప్రసాద్ పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధైర్య పడద్దని, ధైర్యంగా ఉండి ఆరోగ్యాన్ని కుదుటపర్చుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట నాయకులు రవీందర్, రుక్మారెడ్డి, నాగయ్యగౌడ్, జహంగీర్, బాలస్వామి, జంగయ్య, శ్రీనివాస్, భీమయ్య తదితరులు ఉన్నారు.

# ప్రపంచంలో అత్యధిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది : లయన్స్‌క్లబ్‌లు మాత్రమే



**కల్వకుర్తి, డిసెంబర్ 29, ప్రభాతవార్త:** ప్రపంచ వ్యాప్తంగా 200 దేశాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఏకైక సంస్థ లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ అని లయన్స్‌క్లబ్ గవర్నర్ జూలూరి రఘు, ఇండక్షన్ అధికారి నరేందర్‌రెడ్డి, ఇన్‌స్టాలేషన్ అధికారి పోకల చందర్‌లు అన్నారు. బుధవారం రాత్రి కొట్ర చౌరస్తాలోని చెన్నారెడ్డి గార్డెన్‌లో లయన్స్‌క్లబ్ కల్వకుర్తి ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షులుగా లయన్ కలిమిచెర్ల రమేష్, కార్యదర్శిగా చిగుళ్లపల్లి శ్రీధర్, కోశాధికారిగా దుగ్గి వెంకటేష్‌తో పాటు సభ్యులతో ప్రమాణ స్వీకారం అట్ట హాసంగా నిర్వహించారు. రాబోయే రోజుల్లో సామాజిక సేవా కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. లయన్స్‌క్లబ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో కొత్త క్లబ్ ఏర్పాటు కావడంతో పాటు క్లబ్‌కు దీటుగా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో రాధకృష్ణ, చెన్న కిషన్‌రెడ్డి, రమేష్‌బాబు, బావండ్ల వెంకటేష్, డాక్టర్ దామోదర్‌రెడ్డి, రాంరెడ్డి, బచ్చు రామకృష్ణ, జగదీశ్వర్‌తో పాటు పెద్ద సంఖ్యలో తదితరులు ఉన్నారు.

ఆపదలో ఉన్న ప్రజలకు సీఎం సహాయనిధి అండగా నిలిచింది

# సీఎం సహాయనిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే



**మల్దకల్,డిసెంబరు 29 ప్రభాతవార్త :** మల్దకల్ మండల పర్యటనలో వివిధ గ్రామాలకు సంబంధించిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ సరితలు అందజేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులలో సునిత రూ. 48 వేలు, నర్సింలు రూ. 48 వేలు, చిన్నబుచ్చన్న రూ. 36 వేలు, సుదర్శన్‌రెడ్డి రూ. 18 వేల చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగకరమైన పేద ప్రజలు వైద్యం కోసం ఖర్చుపెట్టిన డబ్బులను సీఎం సహాయనిధి ద్వారా 50 శాతం డబ్బుల రూపంలో లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుంది. కరోనా కష్ట సమయంలో కూడా పేద ప్రజలకు అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కెసిఆర్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ జంబురామన్‌గౌడ్, ఎంపిపి రాజారెడ్డి, పిఏసిఎస్ ఛైర్మన్ తిమ్మారెడ్డి, వైస్ ఎంపిపి వీరన్న, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మండల పార్టీ అద్యక్షుడు వెంకటన్న, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు శివారెడ్డి, రాధా పురుషోత్తం, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్ర అభివృద్ధి...

**- మెరుగైన వైద్య సేవల కోసం సీఎం రిలీఫ్ ఫండ్**

**- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు పోతుగంటి రాములు**



**వంగూరు, డిసెంబర్ 29, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం వారి కుటుంబాలకు భరోసాను కల్పించేందుకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు పోతుగంటి రాములు అన్నారు. గురువారం వంగూరు మండలం పోల్కంపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులుకు మంజూరైన రూ.60వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎంపీ రాములు చాంబర్‌లో లబ్ధిదారుడికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదవశాత్తు గాయపడిన క్షతగ్రాతులకు మెరుగైన వైద్య సేవలు అందించి వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపుతో సీఎం రిలీఫ్ ఫండ్ పథకాన్ని ప్రవేశ పెట్టారని ఆయన అన్నారు. ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి ప్రజలకు భరోసాను కల్పిస్తుందని, వితంతవు, వికలాంగు, వృద్ధాప్య, ఒంటరి మహిళల పెన్షన్లతో పాటు షాది ముబారక్, కళ్యాణలక్ష్మి పథకాలను అందిస్తూ పేద ప్రజల గుండెల్లో కేసీఆర్ చిరస్థాయిగా నిలిచిపోతున్నారని ఆయన పేర్కొన్నారు. దళితబంధు పథకాన్ని ప్రవేశ పెట్టి దళితులను అభివృద్ధి పర్చే లక్ష్యంతో రూ.10లక్షల రూ॥లను అందిస్తున్నారని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామీగా నిలిపేందుకు ప్రతినిత్యం కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కేటీఆర్ సేవా సమితి జిల్లా అధ్యక్షులు అంకు సురేందర్, రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మేకల కృష్ణయ్య, బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ ఉపాధ్యక్షులు సాయన్న, మైనార్టీ సెల్ గ్రామ అధ్యక్షులు ముజాహిద్, నాయకులు నిజామొద్ధిన్ తదితరులు ఉన్నారు.

# గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్




**ధరూర్,డిసెంబరు 29 ప్రభాతవార్త :** మండల పరిధిలో బూరెడ్డిపల్లి గ్రామంలో అంగన్‌వాడి భవనం దగ్గర గ్రామ సర్పంచ్ బండ్ల జ్యోతి గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం, బాలామృతం, గుడ్లు అందజేశారు. సర్పంచ్ బండ్ల జ్యోతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సీఎం కెసిఆర్ అంగన్‌వాడిలో గర్భిణీ స్త్రీలకు ప్రతిరోజు అంగన్‌వాడిలో భోజనం, పౌష్టికాహారంతో ఏర్పాటు చేయడం జరుగుతుంది. రక్తహీనం తగ్గకుండా ఉండాలని మంచిబలం రావాలని పుట్టబోయే బిడ్డ మంచి ఆరోగ్యంగా పుట్టాలని బాలామృతం అందజేయడం జరుగుతుంది. సీఎం కెసిఆర్ గతవారం గర్భిణీ స్త్రీల కోసం న్యూట్రిషన్ కిట్‌ను అందజేయడం జరిగింది. బిడ్డకోసం కెసిఆర్ కిట్,తల్లికోసం న్యూట్రిషన్ కిట్ కార్యక్రమంలో కెటిఆర్ యువసేన ప్రధాన కార్యదర్శి కృష్ణకుమార్‌రెడ్డి, గ్రామంలోని మహిళలు, అంగన్‌వాడి టీచర్లు, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

# మండల స్థాయి బోధనోపకరణ కృత్యాల ప్రదర్శన పోటి

**గండీడ్,డిసెంబరు 29 ప్రభాతవార్త :** తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా మండలస్థాయి బోధనో పకరణ కృత్యాల ప్రదర్శన పోటీని గురు వారం జడ్పీహెచ్ఎస్ బాలుర మహ్మదాబాద్ ఎంఈఓ వెంకటయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. ఈ ప్రదర్శనలో మండల పరిధి లోని ప్రతి ఉపాధ్యాయులు వినూత్నమైన బోధ నోప కరణాలను ప్రదర్శించడం జరిగింది. కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ భవిష్యత్తు ఉపాధ్యాయులైన మీ చేతిలో ఉందని విద్యార్థు లకు బోధించేటప్పుడు ఏర్పడే అవరోధాలను ఈ బోధనోపకరణాలతో అధిగమించవచ్చని వీటిని మీ పాఠశాలలో ప్రదర్శించి విద్యార్థుల పురోగతికి బీజం వేయాలని కోరారు. తదుపరి ప్రథమ, ద్వితీయ బహుమతులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. జడ్పీటిసి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిపి మాధవ రాజ్‌కుమార్, సర్పంచ్ పార్వతి, రాజేశ్వర్,పిఆర్‌టియు అధ్యక్షుడు విజయ్ ఆనంద్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, జనార్ధన్, ఆనంద్, గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

# విద్యార్థులు పరిశుభ్రతను పాటించాలి



**మహబూబ్‌నగర్ ప్రతినిధి, డిసెంబర్29,ప్రభాతవార్త:** విద్యార్థులు పరిశుభ్రతను పాటించాలని, తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ముడా ఛైర్మన్ గంజి వెంకన్న సూచించారు. గురువారం మహబూబ్‌గనర్ జిల్లా కేంద్రంలోని గాంధీ హైస్కూల్‌లో విద్యార్థులకు తడి, పొడి చెత్తపై, స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. చెత్తను వేరు చేసిన మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని, ఈమేరకు పిల్లలు తమ ఇండ్లల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇండ్ల మధ్య నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, కాచి చల్లాచల్లార్చిన నీటిని తీసుకోవడం శ్రేయస్కరం అని తెలిపారు.

# ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి...

**- ఆర్యవైశ్య మహాసభ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ**



ఆర్యవైశ్య మహాసభ జిల్లా నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం



ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులను సన్మానిస్తున్న పెద్దకొత్తపల్లి మండల ఆర్యవైశ్య బృందం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 29, ప్రభాతవార్త:** సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంలో ముఖ్య భూమిక పోషిస్తున్న ఆర్యవైశ్యులు మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పులు చేర్పులు చేసుకొని అన్ని రంగాల్లో రాణించే విధంగా ముందుకు సాగాలని ఆర్యవైశ్య మహాసభ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం జిల్లాలోని పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో మహాసభ జిల్లా నూతన సంవత్సర 2023 క్యాలెండర్‌ను మండల ఆర్యవైశ్య నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బచ్చు రామకృష్ణ మాట్లాడుతూ సామాజిక సేవలో ఆర్యవైశ్యుల పాత్ర ఎనలేనిదన్నారు. ఆర్యవైశ్యులు ప్రతి సందర్భంలో తమ సేవభావంతో ముందడుగు వేసి ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండి మానవ సేవే.. మాధవసేవ పరమావాధిగా భావించి అనేక సేవా కార్యక్రమాల్లో తమ వంతు పాత్ర పోషించి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. అంతకు ముందు పెద్దకొత్తపల్లి మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణతో పాటు పలువురు కమిటీ సభ్యులను శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి కలిమిచెర్ల రమేష్, వెల్దండ మండల అధ్యక్షులు ఉప్పు ఆంజనేయులు, పెద్దకొత్తపల్లి మండల అధ్యక్షులు బుసెట్టి శంకరయ్య, మాజీ అధ్యక్షులు శెట్టి, ఆర్యవైశ్య బంధు మిత్రులు రాజశేఖర్, కిశోర్, సుధాకర్, మల్లేష్, జగదీశ్వర్, సాయి ప్రకాష్ తదితరులు ఉన్నారు.

# జిల్లాలో విద్య, వైద్యానికి ప్రాధాన్యత...

**- జెడ్పీచైర్ పర్సన్ బి.శాంతకుమారి**



ప్రొసిడింగ్ కాపీ అందుకుంటున్న జెడ్పీ ఛైర్మన్



కలెక్టర్‌ను సన్మానిస్తున్న జెడ్పీ ఛైర్మన్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 29, ప్రభాతవార్త:** జిల్లాలో వైద్య వైద్యానికి ప్రాధాన్యతనిస్తానని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బి.శాంతకుమారి అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో శాంతకుమారి జెడ్పీ చైర్ పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు. పెద్దకొత్తపల్లి జెడ్పీటీసీ గౌరమ్మ ప్రొసిడింగ్ కాపీని అందించారు. అనంతరం ఆమె బాధ్యతలు చేపట్టారు. అనంతరం జెడ్పీ ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో విద్య, వైద్యానికి ప్రాధాన్యతనిచ్చి జిల్లా అభివృద్ధికి తోడ్పాటునందిస్తామన్నారు. జెడ్పీ ఛైర్‌పర్సన్‌గా తనకు అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్, మంత్రివర్యులు కేటీఆర్, నిరంజన్‌రెడ్డిలతో పాటు జిల్లా ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య వసతులకు తన వంతు కృషి చేస్తానన్నారు. జెడ్పీటీసీలు, కార్యాలయ సిబ్బంది ఎంపీడీఓలు జెడ్పీ చైర్ పర్సన్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. అనంతరం ఆమె జెడ్పీటీసీలతో కలిసి క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఉదయ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించడంతో జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు. జిల్లాలో విద్య, వైద్యంపై కలెక్టర్‌తో కలిసి ఆమె చర్చించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు గౌరమ్మ, దయాకర్‌రెడ్డి, శ్రీశైలం, ప్రతాప్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ఉష, డిప్యూటీ సీఈఓ భాగ్యలక్ష్మి, కార్యాలయ పర్యవేక్షకులు యూసుఫ్, ఎంపీడీఓ అధికారులు తదితరులు ఉన్నారు.

# పోలీస్‌శాఖ విధులు అత్యంత బాధ్యతాయుతమైనవి

మొదటి పేజీ తరువాయి భాగం...



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ

పోలీస్ స్టేషన్‌లో రోజువారిగా నమోదవుతున్న ఫిర్యాదులు, కేసుల రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ రిసెప్షన్, లాకప్, మెన్‌బ్యారెక్, టెక్నికల్ రూం పరిసరాలను పరిశీలించి పోలీస్ స్టేషన్‌లో ఇంప్లిమెంటేషన్ బాగున్నందున పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ అత్యంత బాధ్యతాయుతమైన వ్యవస్థ అని, విధులపట్ల అంకిత భావంగా ఉండాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులోఉండాలని పేర్కొన్నారు. న్యాయబద్ధంగా చట్టాన్ని అమలు చేయడం పోలీసుల బాధ్యత అని, ముందుగా చట్టాలను స్వయంగా పాటిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాలన్నారు. గ్రేవ్ కేసులలో జాప్యం లేకుండా త్వరితగతిన నిందితులను అరెస్టు చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టాలని తెలిపారు. నిందితులకు శిక్షలు పడేలా భౌతిక సాక్ష్యంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించాలని తెలియజేశారు. దొంగతనాల నిర్మూలనకు అనుమానిత వ్యక్తులు ఎప్పుడు కనిపించినా వెంటనే తనిఖీ చేయాలని సూచించారు. రహదారి వెంట డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించి ప్రమాదాలను నివారించడానికి కృషి చేయాలని తెలిపారు. ఆర్థిక నేరాలను కట్టడి చేయడానికి సిసి టివి కెమెరాలు అమర్చే విధంగా ప్రజలను చైతన్య పర్చాలని పేర్కొన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు తీసుకొచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు భద్రత, భరోసా కల్పించే విధంగా పోలీస్ వ్యవస్థ ఉండాలని ప్రజలు ఎటువంటి సమాచారమైనా డయల్ 100 ద్వారా తెలపవచ్చని సూచించారు. పోలీస్ స్టేషన్ రికార్డులు క్రమ పదదతిలో ఉన్నందున సిఐ , ఎస్సైలను ఎస్పీ అభినందించారు.సమావేశంలో సిఐ సీతయ్య ఎస్సైలు పర్వతాలు, రాములు, నరెందర్, విజయభాస్కర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేరాల అదుపులో వనపర్తి జిల్లా పోలీసు భేష్..

మొదటి పేజీ తరువాయి భాగం...

189మంది పిల్లల తల్లిదండ్రులకు జరిమాన విధించి కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందని అన్నారు. ఆపరేషన్ ముస్కాన్-33, ఆపరేషన్ స్మైల్-32 ద్వారా 65మంది బాలకార్మికులను గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి 171మంది పిల్లలను బాలసదన్ కు పంపామని సూచించారు. జిల్లాలో పోలీసు కళాబృందం 10 అవగాహన సదస్సులు నిరిహించి మూఢనమ్మకాలు, డయల్ 100, మద్యం సేవించి వాహనాలు నడపడం వలన జరుగుతున్న అనర్థాల గురించి అలాగే సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, పలు ముఖ్యమైన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. వనపర్తి జిల్లా అంతట కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాలు 1 నిర్వహించినట్లు ఆమె తెలిపారు. జిల్లా పోలీసు అధికారులు సిబ్బందికి 2సార్లు మెగా మెడికల్ క్యాంపుల ద్వారా అన్ని రకాల పరీక్షలు నిర్వహించడం జరిగిందని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా 1136కేసులు పరిష్కరించబడ్డాయని తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగులో భాగంగా జిల్లాలో 500మంది ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలకు ఉచిత శిక్షణ ఇప్పించడం జరిగిందని అన్నారు. సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా పోలీసు కళాజాత బృందంచే అవగాహన కార్యక్రమాలు చేయడం జరిగిందని, 2023 సంవత్సరంలో ప్రజలందరికి మంచి కలగాలని ఆవిస్తూ స్నేహపూరిక పోలీసు విధానాన్ని అవలంబిస్తు వనపర్తి జిల్లా పోలీసు బాధ్యతాయుతంగా, జవాబుదారితనంతో పారదర్శకంగా పని చేస్తూ ప్రజల ధన, మాన, ప్రాణాల రక్షణ కోసం అనుక్షణం పని చేస్తామని తెలుపుతూ జిల్లా పోఎలీసుశాఖ తరుపున జిల్లా ఎస్పీ జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# ఉపాధ్యాయులచే పాఠశాలకు పోర్టబుల్ అంప్లిఫయర్ (మైక్) వితరణ

**రాజాపూర్,డిసెంబరు 29 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, బాలానగర్‌కు 2019,20 సంవత్సరంలో పాఠశాలలో పని చేసిన ఉపాధ్యాయులు, ఇరవై రెండు వేల రూపాయల విలువ చేసే ఆహుజ కంపెనీ 50 వాట్ల పోర్టబుల్ అంప్లిఫియర్‌ను విద్యార్థుల ప్రయోజనార్థం పాఠశాలకు డొనేట్ చేయడం జరిగింది. విద్యా కమిటి ఛైర్మన్ కళ్లెం శ్రీనివాసులు, సభ్యులు పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ప్రయోజనార్థం నిరంతరం కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్‌గౌడ్, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

# అధికారుల అలసత్వానికి తల్లి, బిడ్డలు ప్రాణాలు కోల్పోయారు

**మూడున్నర ఏళ్లుగా కమిటి వేయలేదు రాష్ట్ర జడ్పీటిసిల సంఘం ప్రధాన కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్**



బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**అచ్చంపేట,డిసెంబరు 29 ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న వైద్యుల అలసత్వం కారణంగా తల్లి, బిడ్డలు ప్రాణాలు కోల్పోయారని, రెండు ప్రాణాలు పోవడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని రాష్ట్ర జడ్పీటిసిల సంఘం ప్రధాన కార్యదర్శి పోతుగంటి భరత్‌ప్రసాద్ అన్నారు. అధికారుల మధ్య సఖ్యత లేకపోవడం వల్లనే ఈ ఘోరం జరిగిందని, ఇలాంటి తప్పిదాలు మళ్లీ జరగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. జిల్లా పరిషత్ సమావేశంలో ఎన్నోసార్లు ఆసుపత్రి కమిటి వేయాలని రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కోరిన మూడున్నర సంవత్సరాలు గడిచిన వేయకపోవడంలో రోగుల ఆరోగ్యంపై అధికారులకు ఎంత చిత్తశుద్ధి ఉందో తెలుస్తుందని అన్నారు. నల్లమల అటవి ప్రాంతంలో బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలే జీవనం సాగిస్తున్నారని వారికి మెరుగైన వైద్యం అందించేందుకు అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆసుపత్రిని నిర్మించారని ఆసుపత్రిని ప్రారంభించడానికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. నల్లమల ప్రాంతంలో వైద్యం అందక ఎంతో మంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా వారి ప్రాణాలు కాపాడేందుకు అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు రోజుల క్రితం అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలం ఎల్లంపల్లి గ్రామానికి చెందిన స్వర్ణ (24) ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం కోసం వెళ్లి నరకయాతన అనుభవించి బిడ్డకు జన్మనిచ్చి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ప్రసవించిన కొద్దిసేపటికే పుట్టినబిడ్డ కూడా మృతి చెందడం దారుణమని అన్నారు. గురువారం రాష్ట్ర జడ్పీటిసిల సంఘం ప్రధాన కార్యదర్శి పోతుగంటి భరత్‌ప్రసాద్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందించారు. అధికారుల నిర్లక్ష్యం వలన జరిగిన తప్పిదమే అని భావిస్తున్నానని స్వర్ణ పురిటి నొప్పులతో బాధపడుతూ రాత్రి 9 గం.లనుండి ఉదయం 5 గం.ల వరకు ఆసుపత్రుల చుట్టు తిప్పరు కాని వైద్యం అందించి ప్రాణాలు కాపాడలేకపోయారని అన్నారు.ఆసుపత్రి సిబ్బందికి విషయం తెలిసి కూడా వారికి చెప్పకుండా నిర్లక్ష్యం చేసి తర్వాత ఆమెకు ఫిట్స్ రావడం జరిగిందని ఆమెను మహబూబ్‌నగర్ జిలాల్ల ఆసుపత్రికి తీసుకెళ్లాలని అచ్చంపేట వైద్యుల సమయం వృధాచేసి పంపించడంతోనే తల్లిబిడ్డలు మృతి చెందారని ముందస్తు సమాచారం అందిస్తే ఇలా జరిగేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ నేతలు రేణయ్యగౌడ్, వెంకటయ్య, రమేష్, మల్లయ్య, పాపయ్య పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



**వెల్దండ, డిసెంబర్ 29, ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని చెర్కూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన మలికేడి కిషన్, తాండ్ర పాండు కుటుంబాలను బీఆర్ఎస్ నాయకులు గోపాల్‌నాయక్ పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.3వేల ఆర్థిక సహయం అందించారు. కార్యక్రమంలో భీమరాజు, ఎండీ.షరీఫ్, లాలయ్య, చిన్న జంగయ్య, యాదయ్య, పర్వతాలు, రమేష్, జంగయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

# రైతుభీమా రూ. 5 లక్షల చెక్కు అందజేసిన ఎమ్మెల్యే



**మల్దకల్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మల్దక్ మండల పరిధిలోని నాగర్‌దొడ్డి గ్రామానికి చెందిన సులోచనమ్మ మరణించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం రైతుభీమా రూ. 5 లక్షల చెక్కును ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అందజేశారు. ఆపద స్థితిలో ఉన్న మమ్మల్ని ఆదుకున్నందుకు తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి రాజారెడ్డి, వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్ సవారమ్మ, బిఆర్ఎస్ పార్టీ నాయకులు అజయ్, నారాయణ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మద్దిగట్ల హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణంలో.. అవినీతి జబ్బు..!

మొదటి పేజీ తరువాయి భాగం...

వారు స్పందించడం లేదనే విమర్శలు ఉన్నాయి. రూ.26లక్షలతో చేపడుతున్న ఈ నిర్మాణానికి ఇటీవలె రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఇలా నాణ్యతలేని భవనాన్ని నిర్మిస్తే ఎన్ని రోజులు ఉంటుందని ప్రజా ప్రయోజనాల కోసం నిర్మిస్తున్న ఈ భవనం ప్రజలకు ఏ మేరకు ఉపయోగపడుతుంది. నాణ్యతలేని ఇసుకతో భవనం నిర్మిస్తే ఉంటుందా. కూలూతుందా అనే సందేహం గ్రామస్తుల్లో నెలకొంది. నాలుగు కాలాల పాటు గ్రామస్తులకు ఉపయోగపడాల్సిన భవనం నిర్మాణాన్ని వెంటనే ఆపివేసి నాణ్యతతో నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. భవనం దగ్గర పోసిన ఇసుక మెర్రంను తలపిస్తుందని గ్రామస్తులు పంచాయితీరాజ్ ఏఈ భాస్కర్ దృష్టికి తీసుకెళ్లారు.

# గ్రామ గ్రామాన పల్లె దవాఖానా..!

మొదటి పేజీ తరువాయి భాగం..

పరీక్షలను జిల్లా ఆసుపత్రిలో ఉచితంగా చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ జంబు రామన్‌గౌడ్, ఎంపిపి రాజారెడ్డి, పిఏసిఎస్ ఛైర్మన్ తిమ్మారెడ్డి, వైస్ ఎంపిపి వీరన్న,మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటన్న,మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు శివారెడ్డి, రాధా, పురుషోత్తంరెడ్డి, పిఏసిఎస్ వైస్ ఛైర్మన్ విష్ణు, వ్యవసాయ మార్కెట్ యార్డు డైరెక్టర్ సవారన్న, బిఆర్ఎస్ పార్టీ నాయకులు సీతారాంరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, విక్రమ్ సింహారెడ్డి, చక్రదర్‌రెడ్డి, నరెందర్, మధునాయకి, నరసింహారెడ్డి, ఆంజనేయులు, రాధాకృష్ణరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, భాస్కర్, ఎల్లప్ప, శేషాద్రినాయుడు, సుధాకర్‌గౌడ్, ఆంజనేయులు, భాస్కర్‌గౌడ్, మండల పార్టీ యూత్ అధ్యక్షుడు ప్రవీణ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మహేష్, నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# హత్ సే హత్ జోడో యాత్రం జయప్రదం చేయండి

**మాజీ ఎమ్మెల్యే,టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రశేఖర్**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,డిసెంబర్29,ప్రభాతవార్త :** జాతీయ పార్టీ పిలుపుమేరకు జనవరి 26 నుంచి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేపట్టనున్న హత్ సే హత్ జోడ యాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే,టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రశేఖర్ కోరారు. ఈమేరకు నవాబుపేట మండలంలోని స్టార్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పథకాలను ప్రజలకు వివరిస్తూ, అదేవిధంగా బీఆర్ఎస్,బీజేపీ అవలంభిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలు ఎండగడుతూ యాత్ర కొనసాగించాలని కోరారు. రాష్ట్రంలోని నిరంకుశ పాలనకు చమరగీతం పాడాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రెటరీ బంగ్లా రవి, జహీర్ అక్బర్, ఎంపీటీసీ రాంచందర్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కొండల్, నాయకులు కొల్లూరు ఖాజా, రమేశ్‌గౌడ్,మైనొద్దిన్, మల్లేశ్,సత్యం గౌడ్ పాల్గొన్నారు.

**శ్రీశ్రీశ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో**

# భక్తులకు ఏ రకమైన ఇబ్బంది కలగదు

మొదటి పేజీ తరువాయి భాగం...

వాటిపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో ఏఈని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రెండవ యాదాద్రిగా పేరుగాంచిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్స వాలు వైభవంగా నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలన్నారు. 6 రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్స వాలకు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఘనంగా నిర్వహించాలన్నారు. జాతరలో రథోత్స వానికి లక్షల సంఖ్యలో వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు కాబట్టి ఏర్పాట్లు, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎం కేసీఆర్ సహాకారంతో రూ.15కోట్లతో ఆలయ పునర్నిర్మాణం పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్డీఓ హనుమాన్‌నాయక్, ఆలయ ట్రస్ట్ ఛైర్మన్ రాజా, ఆదిత్య లక్ష్మణరావు, ఆలయ ఏఓ, ఇతర ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

# దేశంలో రాబోయేది బీజేపీరహిత ప్రభుత్వమే

## బీజేపీ కుట్రలు పసిగట్టలేనంత అమాయకుడు సిఎం కేసీఆర్ కాదు: మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్


మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్

**వనపర్తి టౌన్,డిసెంబర్ 29 ప్రభాతవార్త:** నాడు ఓటుకు నోటు కేసులో ఎమ్మెల్సీని కొనుగోలు చేయడానికి ప్రయత్నించి బహిరంగంగా నాటి టీడీపీ అధ్యక్షుడు నేడు టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి పట్టుబడ్డాడని, దేశంలోని ఎనిమిది రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రభుత్వాలను కూలదోసిన బీజేపీ ఏజెంట్లు తెలంగాణ గడ్డ మీద రెడ హ్యాండెడ్‌గా దొరికిపోయారని వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్ విలేకరుల సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు రేవంత్‌రెడ్డి కాపాడుతున్న ఇప్పుడు ఈ బీజేపీ ఏజెంట్లను కాపాడుతున్నది ఈ దేశంలోని లోపభూయిష్టమయిన న్యాయవ్యవస్థనే అని కాకుంటే దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ తన బ్రోకర్లను ఎమ్మెల్యేల కొనుగోలు కేసుల నుండి కాపాడుకోవడానికి అధికార దుర్వినియోగం చేయడానికి పాల్పడుతుందని అన్నారు.న్యాయమూర్తులను మార్చి తన బ్రోకర్లను, ఎమ్మెల్యేలను కొనుగోలు కేసుల నుండి కాపాడుకోవడానికి అధికార దుర్వినియోగానికి పాల్పడి న్యాయమూర్తులను మార్చి తన బ్రోకర్లను కాపాడుకోవడానికి బెయిలు ఇప్పించి అరెస్టులకు అడ్డుతగిలి దర్యాప్తుకు ఆటంకాలు కల్పించి సిట్ దర్యాప్తును సీబీఐకి అప్పగించేలా చేస్తూ ఒక అడుగు ముందుకు వేస్తుందని అన్నారు. ఎమ్మెల్యే కొనుగోలు వ్యవహారం మొదట వారంతా కేసీఆర్ తీసిన సినిమా లో నటులని అన్నారు. తరువాత వారితో మాకు సంబంధం లేదన్నారు. తర్వాత మాకేం కర్మ అన్నారు. సంబంధం లేదంటూనే కోర్టుల్లో పిటిషన్లు వేశారని అన్నారు. బీజేపీ ముఖ్యులతో నిందితుల అందరి పరిచయాలు మీడియాలో ప్రముఖంగా వచ్చాయన్నారు. చివరకు బీఎల్ సంతోష్ పేరు బయటకు రాగానే బీజేపీ నేతల నోట్లో పచ్చి వెలక్కాయ పడిందని అన్నారు. బీఎల్ సంతోష్‌ను ఇరికిస్తారా అని బండి సంజయ్ ఏడ్చాడని ఎద్దేవ చేశారు. అరెస్టు ఎలా చేస్తారని ఆక్రోశించారన్నారు.సిట్ ఉండగానే ఈడీనీ,ఐటీని రంగంలోకి దించారని తెలిపారు. మంత్రులు గంగుల, మల్లారెడ్డి, ఎంపీ వద్దిరాజులను బెదిరించే ప్రయత్నం చేశారని, ఇప్పటికీ చేస్తున్నారనిఅన్నారు.ఇప్పుడు రోహిత్ రెడ్డి మీద పడ్డారని అన్నారు. మొత్తం కేసు సీబీఐకి అప్పగిస్తున్నట్లు చెప్పగానే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బండిసంజయ్‌లు సంకలు గుద్దుకుంటున్నారని అన్నారు. అమ్మ పుట్టిల్లు మేనమామకు ఎరుక అని బీజేపీ కుట్రలు పసిగట్టలేనంత అమాయకుడు కేసీఆర్ కాదు అని దేశంలోని అన్ని వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న బీజేపీ కుట్రలను పసిగట్టారని తెలిపారు. 14ఏళ్ల ఉద్యమంలో కేసీఆర్ ఎన్ని ఉత్థాన పత్తనాలు చూసి ఉంటారని అన్నారు. అందుకే తనకు అందిన ఆధారాలను దేశంలోని న్యాయమూర్తులకు పంపి దేశ ప్రజలముందు ఉంచారని అన్నారు. ఎనిమిదిన్నరేళ్ల అధికారంతో మదమెక్కిన ఏనుగుల్లా దేశాన్ని అమ్ముతున్న మోదీ, అమిత్ షా ద్వయానికి తెలంగాణలో ఎమ్మెల్యేల కొనుగోళ్లను కేసీఆర్ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోవడం ఏమాత్రం రుచించలేదని అన్నారు. దేశంలోని రాజకీయ నేతలంతా జీ హుజూర్ అంటూ మోకరిల్లుతుంటే కేసీఆర్ ఎదిరించి, ప్రశ్నించాడని తట్టుకోలేక పోతున్నారని మండిపడ్డారు. అందుకే అన్ని వ్యవస్థలను తెలంగాణ మీద ప్రయోగిస్తున్నారని అన్నారు. మోదీ,అమిత్‌షా ఎన్ని కుట్రలు చేసిన వాట్సప్ యూనివర్సిటీ కథలు అల్లినా బీజేపీ ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవ హారం దేశం మొత్తం తెలిసిపోయిందని ప్రపంచం ముందు బీజేపీ పరువు పోయిందని అన్నారు. దాన్ని నుండి నష్టనివారణ కోసం బీజేపీ అధిష్టానం న్యాయవ్యవస్థతో ఆటలాడుతుందని, సీబీఐని పావుగా చేసి ఏదో సాధించాలని ఉవ్విళ్లురుతుందని కానీ మోదీ, అమిత్‌షా ఏం చేసినా కుక్కతోక పట్టుకొని గోదావరి నది ఈదినట్లేనని ఎద్దేవ చేశారు. ప్రజల్లో పోయిన పరువు తిరిగి రాదని, దేశంలో బీజేపీ మనుగడకు కాలం చెల్లినటేంలనని దేశంలో రాబో యేది బీజేపీరహిత ప్రభుత్వమే అనడంలో ఎలాంటి సందేహం లేదని మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్ అన్నారు.

# మంత్రి నిరంజన్‌రెడ్డి ఒత్తిడితో బీజేపీ నాయకులపై పోలీసుల అక్రమ కేసులు

### బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.నారాయణ

**వనపర్తి టౌన్,డిసెంబర్ 29 ప్రభాతవార్త:** మంత్రి నిరంజన్ రెడ్డి పోద్బలంతో బీజేపీ నాయకులపై పోలీసులు అక్రమ కేసులు పెట్టడాన్ని ఖండిస్తూ వనపర్తి జిల్లా బీజేపీ పార్టీ కార్యలయంలో ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి డి.నారాయణ మాట్లాడుతూ డిసెంబర్ 27వ తేదీన జిల్లా కేంద్రంలోని పోలీసుల అనుమతితో నిర్వహించి రైతు ధర్నాలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ మున్సిపల్ చైర్మెన్ బి.కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడి సాయం కింద ఇస్తున్న రైతు బంధు చిన్న సన్నకారు రైతులకు కాకుండా వందల ఎకరాల భూస్వాములకు, రాష్ట్ర మంత్రివర్గంలోని మల్లారెడ్డికి 600 ఎకరాలకు ఇతర మంత్రులకు వందలాది ఎకరాలకు రైతుబంధు ఇవ్వడంవల్ల రైతులకు ఏకకాలంలో లక్ష రూపాయల రుణమాఫీ చేయడానికి డబ్బులు లేవనే వాస్తవాన్ని మాత్రమే పేర్కొన్నారని ఎక్కడా కూడా మంత్రిని వ్యక్తిగతంగా అసభ్య పదజాలంతో దూషించలేదని తెలిపారు. వనపర్తి నియోజకవర్గంలో మంత్రి నిరంజన్ రెడ్డి కి వ్యతిరేకంగా ధర్నాలు, ఆందోళనలు చేయడానికి ఏ ప్రతిపక్ష పార్టీ సిద్ధంగా లేదని కేవలం బీజేపీ మాత్రమే రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లోకి తీసుకువెళ్తుందని దీన్ని జీర్ణించుకోలేక మంత్రి సొంత నియోజకవర్గంలో వనపర్తి నడిబొడ్డున నిర్మాణమైన సహకారా బ్యాంకు కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ కిరాయిల వ్యవహారంలో సింగిల్‌విండో పాలకవర్గాలు పాల్పడిన కుంభకోణాన్ని బహిర్గతం చేసి గత


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ప్రధాన కార్యదర్శి డి.నారాయణ

ఆరు నెలలుగా బీజేపీ పోరాటం చేస్తుందని దీనిని జీర్ణించుకోలేని మంత్రి బీజేపీ నాయకులపై పోలీసుశాఖ వారిపై ఒత్తిడి తీసుకువచ్చి కేసులు నమోదు చేస్తున్నారని పేరొన్నారు గత ఆగస్టు 30వ తేదీన స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆసరా పెన్షన్ల అనుమతి పత్రాలు అందజేస్తూ ఢిల్లీలో ఉండే గడ్డపోడు, మోదీగాడు, తన ముడ్డి తానే కడుక్కోలేడు మాకు నీతులు చెప్తాడని సాక్షాత్తు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ని ఒక క్యాబినేట్ మంత్రి హోదాలో ఉండి వ్యక్తిగత దూషణకు దిగిన మంత్రి నిరంజన్ రెడ్డి పై ప్రభుత్వం ఏవిధమైన కేసులు నమోదు చేసిందో బహిర్గతం చేయాలని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు ఎవరు కూడా మంత్రిని వ్యక్తిగత దూషణకు పాల్పడలేదని గతంలో వనపర్తిమున్సిపల్ కౌన్సిల్లో మహిళా కౌన్సిలర్ల భర్తలు, మున్సిపల్ అధికారులను, మహిళా అధికారులను బండబూతులతో దూషిస్తూ పేపర్లో రాయలేని విధంగా తిట్టిన విధంగా తిట్టిన విషయాన్ని ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా, సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టిందని మరి ప్రభుత్వ అధికారిని బండబూతు తిట్టిన మహిళ కౌన్సిలర్ల భర్తలపై ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టారని వనపర్తి రోడ్ల విస్తరణలో భాగంగా హిందూ దేవాలయాలను అక్రమంగా తొలగిస్తూ హిందూ మనోభావాలను దెబ్బతీస్తూ ఒక సామాజిక వర్గానికి అనుకూలంగా వ్యవహరించడంతో బీజేపీ నాయకులు మంత్రి చేస్తున్న ఏకపక్ష నిర్ణయాలకు వ్యతిరేక ఆందోళనలు చేయడం అక్రమ కేసులు పెట్టడానికి మూల కారణం అన్నారు. క్యాంపుకార్యాలయం ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఉద్దేశించి అసభ్యకరంగా వ్యక్తిగత దూషణకు పాల్పడిన మంత్రి పై మేము కూడా పోలీసులకు ఫిర్యాదు చేయబోతున్నామని దానికి సంబందించిన వీడియోను పోలీసులకు అందించనున్నామని అధికార పార్టీ మాజీ కౌన్సిలర్ ఫిర్యాదు చేసిన వెంటనే ఎఫ్ఆర్ చేయాలని లేని పక్షంలో బీజేపీ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా లో అన్ని మండల కేంద్రాల్లో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి.పరుశురాం, జిల్లా అధికార ప్రతినిధి మీడియా ఇన్చార్జ్, జిల్లా అధికార ప్రతినిధి బచ్చురాము, పట్టణ అధ్యక్షులు బోయల రామ్మోహన్, ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షులు ఆగపోగు కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి మామిళ్లపల్లి రాయన్న పాల్గొన్నారు.

## నేడు వాహనాల వేలం పాట

**కొత్తకోట,డిసెంబర్ 29 ప్రభాతవార్త:** కొత్తకోట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో పట్టుబడ్డ వాహనాలకు శుక్రవారం ఎక్సైజ్ సూపరిండెంట్ ప్రభు వినయ్ కుమార్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఓంకార్ తెలిపారు. పట్టుబడిన రెండు వాహనాలకు వేలం పాట నిర్వహిస్తున్నామని ఆసక్తి గలవారు రూ.5వేలు డిపాజిట్ చేసి వాహనాల వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

## జీన్గరాలలో గ్రామస్థులకు రగ్గుల పంపిణీ



జీన్గరాలలో రగ్గులను అందజేస్తున్న దృశ్యం

**దేవరకద్ర డిసెంబరు 29 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం జీన్గరాలలో గురువారం గ్రామస్థులకు సోలార్ కంపెని అధ్వర్యంలో రగ్గులను పంపిణీ చేశారు. ప్రతి ఏడాది ఈ విధంగా గ్రామస్థులకు సోలార్ కంపెని అధ్వర్యంలో రగ్గులను పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. సోలార్ కంపెని యాజమాన్యాన్ని గ్రామస్థులను సర్పంచ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి, సోలార్ కంపెని మేనెజర్ వెంకట్రావుతో పాటు యంపీటీసీ తిరుపతయ్య, గ్రామస్థులునాగరాజు,భాస్కర్‌గౌడ్,లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## దేవరకద్రలో ఘనంగా ఇరుముడిధారణ


దేవరకద్రలో అయ్యప్పస్వాముల ఇరుముడిధారణ

**దేవరకద్ర,డిసెంబరు29 ప్రభాతవార్త:** దేవరకద్రలో గురువారం అయ్యప్ప స్వాములు,అయ్యప్పగురుస్వాముల ఇరుముడిధారణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.స్థానిక ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలోగురు స్వాములు కరుణంరాజు,బాల్‌రాజ్ స్వాముల అధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని సాంప్రదాయరీతిలో,భక్తిశ్రద్దలతో నిర్వహించారు.ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజల అనంతరం అయ్యప్పస్వాముల ఇరుముడి ధారణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయ్యప్పమాలలు వేసిన చిన్నారులు సైతం ఇరుముడిధారణ చేశారు.వివిధ ప్రాంతాలనుండి వచ్చిన అయ్యప్పస్వాముల బంధువులు వారికి పూతన వస్త్రాలను అందజేశారు.దీంతో స్థానిక ప్రసన్నాం జనేయస్వామి దేవస్థానం భక్తిపారవశ్యంతో పులకించి పోయింది. అలాగే అయ్యప్పస్వాములు సద్ది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇరుముడి ధారణ అనంతరం దాదాపు 30మంది అయ్యప్పస్వాములు శబరిమలకు బయలుదేరి వెళ్లారు.ఈ కార్యక్రమానికి అయ్యప్పస్వాముల బంధువులు, భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. దీంతో ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం అయ్యప్పస్వాములతో కిక్కిరిసిపోయింది.

## పుట్టపల్లిలో గడ్డివాములు దగ్ధం



**దేవరకద్ర డిసెంబరు 29 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం పుట్టపల్లిలో గురువారం గడ్డివాముల నిప్పంటుకొని దగ్ధమయ్యాయి. వివరాలు ఈ విదంగా ఉన్నాయి. గ్రామానికి చెందిన బీసుపల్లి అనే రైతు గ్రామంలో తమ పశువులకోసం దాదాపు 8 గడ్డివాములను నిల్వ ఉంచారు. అయితే ప్రమాదవశాత్తు అట్టి గడ్డివాములకు నిప్పంటుకొంది. దీంతో గ్రామస్థులు ఫైర్‌ఇంజన్‌కు సమాచారమందించారు. అయితే ఫైర్‌ఇంజన్ వచ్చి మంటలు ఆర్పినప్పటికి గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో దాదాపు రూ.50 వేల నష్టం వాటిల్లినట్టు బాదితుడు తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి


పాములను అడవిప్రాంతంలో వదులుతున్న కృష్ణ సాగర్

**వనపర్తి టౌన్,డిసెంబర్ 29 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా వ్యాప్తంగా వివిధ గ్రామాలు, పట్టణాల్లో జన నివాసంలోకి వచ్చిన 16 విషసర్పాలను చాకచక్యంగా బందించిన కృష్ణ సాగర్ గురువారం దట్టమైన అడవి ప్రాంతాల్లో వదిలేయడం జరిగింది. నాగుపాములు 6, కట్లపాములు 2, రక్తపింజలు 3, జెర్రిపోతు1, నూనె కట్లపాము1, కోడెనాగు 1శ్రీనివాసపురం,అప్పాయిపల్లి తాండ, సొంత బజార్, రాజనగరం, చిట్యాల, శ్వేతనగర్, రాయిగడ్డ, మర్రికుంట, జంగమాయిపల్లిలో బందించిన సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షులు కృష్ణ సాగర్ బందించిన పాములను దట్టమైన అడవి ప్రాంతంలో వదిలి వేస్తూ కృష్ణ సాగర్ మాట్లాడుతూ వన్య ప్రాణులకు సరైన ఆహారం నీళ్లు లేకపోవడం వలన మనుషులు నివసించే ప్రాంతాలకు వస్తున్నాయి కాబట్టి ఆరు బయట పడుకునే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు కూడా భాగస్వామ్యం కావాలని వన్యప్రాణులకు ఎలాంటి హాని కలిగించకుండా కనబడితే నాకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎస్పీ అపూర్వ రావు ఆదేశాల మేరకు వేరేస్ కరోనా వైరస్ మళ్లీ విజృభిస్తున్న వేళ ప్రతి ఒక్కరు శానిటైజర్స్ వాడుతూ సామాజిక దూరం పాటిస్తూ మాస్కులు ధరించాలి అప్రమత్తంగా ఉండాలని, రైతులు రైతు బంధు డబ్బులు తీసుకునేటప్పుడుతగు జాగ్రత్తలు తీసుకోవాలని సెల్ ఫోన్‌లో వచ్చే అపరిచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్‌ను, మేసెజెస్ ఓపెన్ చేయవద్దని ఆయన కోరారు. పోలీసు వారి సహాయం కొరకు డయల్ 100ను ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

## సిలబస్‌లో మత గ్రంథాలను చేర్చడాన్ని వెనక్కి తీసుకోవాలి

### ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా కార్యదర్శి ఎం.ఆది



సమావేశంల మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.ఆది

**వనపర్తి టౌన్,డిసెంబర్ 29 ప్రభాతవార్త:** సీబీఎస్ఈ సిలబస్‌లో నూతన విద్యావిధానంలో భాగంగా ఆరు ఏడు తరగుతులలో కేంద్ర ప్రభుత్వం భగవద్గీతను చేర్చాలనే నిర్ణయం తీసుకోవడాన్ని వెనక్కి తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ వనపర్తి జిల్లా కమిటీ డిమాండ్ చేస్తోంది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా కార్యదర్శి ఎండి.ఆది మాట్లాడుతూ ఇంటర్మీడియట్‌లో కొన్ని శ్లోకాలను 11,12 తరగతులలో సాంస్కృతం పాఠ్యాంశాల్లో చేర్చడం అంటే విద్యను కషాయికరణ చేయడం అని ఎస్ఎఫ్ఐ భావిస్తోందని విద్య అనేది సమాజానికి ఉపయోగపడి మానవ వనరులను అభివృద్ధి చేసేదిగా ఉండాలి తప్ప మతం పేరుఎతో సమాజాన్ని చీల్చేందుకు ఉపయోగపడకూడదని, విద్యలో మత గ్రంథాలను తీసుకురావడం అంటే రాజ్యాంగ హక్కులు కాలరాయడమేనని,శాస్త్రీయ విద్య విధానంతోనే శాస్త్ర, సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందుతున్నాయి తప్ప మత గ్రంధాల మూలంగా కాదు అని అన్నారు. పాఠశాల విద్యలో భగవద్గీతను ప్రవేశ పెట్టడాని వెనక్కి తీసుకొని శాస్త్రీయ విద్యను అందించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తుందని అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్దాంతాలు విద్య రంగంలో తీసుకురాకుండా విద్యార్థులు పోరాడాలని ఎస్ఎఫ్ఐ పిలుపునిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నేతలు శరత్, రాఘవేంద్ర,అశోక్,వంశీ, రాఘవేంద్ర, విజయ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల పట్ల పిల్లలు సత్ప్రవర్తన కలిగి ఉండాలి


వల్లభాపురం కళాకారుడు శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న మనిగిళ్ల హైస్కూల్ యాజమాన్యం

**పెద్దమందడి,డిసెంబర్29 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి ఎం.ఎ.రషీద్ పర్యవేక్షణలో తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం గురువారం పెద్దమందడి మండలం మనిగిళ్ల హైస్కూల్‌లో కరోనా జాగ్రత్తలు, విద్యా ప్రాధాన్యత, ఆరోగ్య జాగ్రత్తలు, తల్లిదండ్రుల పట్ల పిల్లల సత్ప్రవర్తనలాంటి పలు అంశాలపై విద్యార్థులకు ఆటపాటల ద్వారా చైతన్య పరచమైనది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్‌గౌడ్ మాట్లాడుతూ కళాజాత బృందం వారు అనేక విషయాల పట్ల విద్యార్థులకు చక్కని సాంస్కృతిక రూపాల ద్వారా తెలియపరిచినారని భవిస్యత్తులో విద్యార్థులు చక్కని లక్ష్యాలను ఏర్పరుచుకొని ఆ దిశగా వారి యొక్క కృసి ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సీనియర్ కళాకారుడు వల్లభాపురం శ్రీనివాస్‌కు పాఠశాల తరుపున సత్కారం చేయడం జరిగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం విష్ణు, నాగేశ్వరమ్మ,సురేఖ, కుమారి దివ్య, తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం కళాకారులు టీం లీడర్ గుడిసె శివలింగం, ఎస్.శ్రీనివాసులు, డి.కృష్ణయ్య, బోనాసిరాజు, ఎన్.సువర్ణ, ఎన్.శ్రీదేవి, ఎమ్.రాధ, ఎం.జోష్ణ, ఎం.జానకి విద్యార్థులు పాల్గొన్నారు.

## చిన్నరాజమూర్‌లో ఘనంగా కళాపకర్షణ పూజ



**దేవరకద్ర డిసెంబరు29 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం చిన్నరాజమూర్‌లోని శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం రాత్రి కళాపకర్షణ పూజ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రధానపూజారి రాఘవేంద్రాచారి,చైర్మెన్ గోపాలచారిల అధ్వర్యంలో ఈ పవిత్ర పూజా కార్యక్రమాన్ని సాంప్రదాయరీతిలో నిర్వహించారు. అలాగే దేవస్థానం ఆవరణలో పురోహితుల వేదమంత్రాలు,సన్నాయి వాయిద్యాల మద్య పవనామ హోమం,పుణ్యాహవచనం,అభిషేకం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కలశాభిషేకం పూజా కార్యక్రమాన్ని కూడ భక్తిశ్రద్దలతో పురోహి తులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని అలంకరించి ఈ పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ ప్రసాద్,పురోహితులు,భక్తులు తదితరులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

**మహ్మదాబాద్,డిసెంబరు 29 ప్రభాతవార్త:** మహ్మదాబాద్ మండలం నంచర్ల గ్రామంలో గురువారం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ని మహబూబ్‌నగర్ వాగ్దేవి కళాశాల ప్రిన్సిపాల్ వి. వెంకట్‌రెడ్డి, కోట్ల శివకుమార్ ఇవ్వడానికి దాతలుగా నిలిచారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్వర్‌రెడ్డి,గ్రామ సర్పంచ్ కెఎం అనసూయ నారాయణ, ఎంపిపి మాధవ రాజ్ కుమార్‌రెడ్డి, జడ్పీటిసి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఆనంద్‌కుమార్ చేతుల నుండి స్టడీ మెటీరియల్ ఇప్పించడం జరిగింది. విద్యార్థులు మంచిగా చదువుకుని మంచిమార్కులతో పాస్‌కావాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## డిజైనర్ పిల్లోస్ తయారి కేంద్ర ప్రారంభం


డిజైనర్ పిల్లోస్ తయారి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**వనపర్తి ప్రతినిధి,డిసెంబర్29 ప్రభాతవార్త:** నాబార్డ్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ వనపర్తి ఆధ్వర్యంలో 15రోజులు జిల్లా మహిళా సమాఖ్యలో శిక్షణ ఇప్పించడం జరిగింది. మండలం నుండి వివిధ గ్రామాల నుండి 15మందికి శిక్షణ ఇప్పించడం జరిగింది. అందులో నుండి డిజైనర్ పిల్లోస్ తయారీ కొరకు ముందుకు వచ్చిన వారికి మండల సమాఖ్య నుండి ఒక్కరికి రూ.50వేల చొప్పున పామిరెడ్డి గ్రామంలోని నలుగురికి రూ.2లక్షలు అప్పుగా ఇవ్వడం జరిగింది. ఈ అప్పును సభ్యులు వారు నిర్ణయించుకున్న వాయిదాల ప్రకారం తిరిగి మండల సమాఖ్యకు చెల్లిస్తారు. ఇక్కడ తయారు చేసిన ఉత్పత్తులు ఇతర ప్రాంతాలకు మేళాలకు పంపించి మార్కెటింగ్ చేయడం జరుగుతుంది. కార్యక్రమంలో సర్పంచ్ సిద్దయ్య, ఉపసర్పంచ్ గోవర్దన్ రెడ్డి, మాజీ ఎంపీపీ మాన్యపు రెడ్డి, ఏపీఎమ్ వెంకన్న, సీసీ ఆంజనేయులు, కాశీనాథ్, ఎంఎంఎస్ అధ్యక్షులు స్వరూప, వీఓఏ అరుణ, కమిటీ సభ్యులు చిట్టెమ్మ, కురువమ్మ, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం తక్షణమే రైతులకు రూ.1లక్ష రుణమాఫీ చేయాలి



**వనపర్తి టౌన్,డిసెంబర్ 29 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు తక్షణమే లక్ష రూపాయల రుణమాఫీ చేయాలని వనపర్తి జిల్లా రైతు సంఘం కార్యదర్శి పరమేశ్వరచారి మాట్లాడుతూ తెలంగాన ప్రభుత్వం గత మూడు సంవత్సరాల క్రితం రైతులకు తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వస్తే లక్షల రూపాయల రుణమాఫీ చేస్తానని చెప్పి అధి కారంలోకి వచ్చి 3 సంవత్సరాలు కావస్తున్న నేటి వరకు రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేయడం లేదని రైతులు పంటలకు పెట్టుబడులు పెట్టలేక బ్యాంకు వారు అప్పులు ఇవ్వలేక యాసంగి సీజన్ ప్రారంభమై కరిగేటకు నాట్లకు కూలీలలకు,ఫర్టిలైజర్‌కు ప్రైవేట్ వ్యక్తుల దగ్గర రైతులు అధికవడ్డీలకు అప్పులు తీసుకువచ్చి అప్పులపాలయ్యే పరిస్థితి ఉన్నందున ప్రభుత్వం ఇప్పటికైనాస్పందించి తక్షణమే రూ.1లక్ష రుణమాఫీ చేసి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను పెద్దఎత్తున సమకూర్చి ధర్నా కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. రైతులు వెంకటయ్య, రాములు,నారాయణ,చిన్నయ్య పాల్గొన్నారు.

## ఘనంగా స్వాగతోత్సవ కార్యక్రమం


స్వాగతోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మధుసూదన్‌శర్మ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్29, ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో స్వాగతోత్సవ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వాగతోత్సవ ఆహ్వాన కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు సన్మార్గంలో నడువాలని సూచించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రావు, అధ్యాపకులు విజయ, ధర్మ, కృష్ణ, హాజీర, పర్విన్, పరమేష్, రాజుకుమార్,పరమేష్,సతీష్, అశోక్, మహాదేవ్, చంద్రశేఖర్, రవీందర్, మల్లయ్య తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న టీడీపీ నాయకులు

**శ్రీరంగాపురం,డిసెంబర్29 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఈనెల 21వ తేదీన అకాల మరణం చెందిన వసంతపురం రాజేందర్ కుటుంబాన్ని ఫోన్‌లో టీడీపీ కేంద్ర పార్లమెంట్ పోలిట్‌బ్యూరో, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి రాజేందర్ దశదినకర్మలకు హాజరైన టీడీపీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.రాజశేఖర్, రావుల చంద్రశేఖర్ తో రాజేందర్ తండ్రి సత్యనారయణ ఫోన్‌లో మాట్లాడి వారి కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటామని ఖర్చులకురూ.10వేలు ఆర్థికసహాయం చేస్తూ వారిని పరామర్శించడం జరిగింది.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు మాధవరెడ్డి,పెబ్బేరు మండల అధ్యక్షులు గోల్డ్ బాలస్వామి, పెబ్బేరు యూత్ ప్రెసిడెంట్ ఎల్లగౌడ్,టీడీపీసీనియర్ నాయకులుసితార వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు నాగరాజు, శంకర్ పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం


కావలి మన్నెమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మాజీ వైస్ ఎంపీపీ గుంతమల్లేష్

**కొత్తకోట,డిసెంబర్29 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కనిమెట్ట గ్రామంలో కావలి మన్నెమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న యాజీ వైస్ ఎంపీపీ గురువారం ఆమె పార్థివదేహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్ రెడ్డి సూచన మేరకు మృతురాలి కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయం అందజే శారు. ఈ కార్యక్రమంలో పరమేష్, కోటేశ్వర్‌రెడ్డి, సురేష్ యాదవ్, మందబాబు, మన్యంకొండ, పరుశరాములు, శ్రీనివాస్‌రెడ్డి, శివచారి పాల్గొన్నారు.

## రైతులకు రూ.1లక్ష రుణమాఫీ చేయాలి



**వనపర్తి టౌన్,డిసెంబర్ 29 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో తెలంగాణ ప్రజల పార్టీ చేస్తున్న రైతు దీక్షకు గురువారం అచలపక్ష ఐక్యవేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, జానంపేట రాములు, పొట్టినేని గోపాలకృష్ణ నాయుడు, నందిమల్ల చంద్రమౌళి లు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సతీష్ యాదవ్ మాట్లాడుతూ 8ఏళ్లుగా తెలంగాణ ప్రభుత్వంలో రైతులకు ఇస్తానన్న రుణమాఫితోపాటు చాలా వరకు ప్రకటించిన పథకాలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పరిష్కరించాలని కోరుతూ వనపర్తి అచలపక్ష ఐక్యవేదికకు ఎల్లప్పుడూ సంఘీభావం తెలిపే మురళీ గుప్త ఈ దీక్ష ప్రక టించడంతో వారికి మద్దతు తెలపాలని వనపర్తి నుండి వచ్చి మద్దతు తెలుపుతున్నామని పార్టీ ఏదైనా పోరాడే గొంతుకకు మద్దతు తెలుపుతామని ఆయన అన్నారు. ఈ దీక్షలో మురళీగుప్తకి సంఘీభావంతో పాటు అభినందనలు తెలిపారు.

## కోనేరు కోనప్ప నిత్యాన్నదాన సత్రాన్ని సందర్శించిన మంత్రి నిరంజన్‌రెడ్డి


కోనేరు కోనప్ప అన్నదాన సంత్రాన్ని సందర్శించి నిర్వాహకులతో మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి ప్రతినిధి,డిసెంబర్ 29 ప్రభాత వార్త:** కొమురంభీం అసిపాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్‌లో కోనేరు కోనప్ప గారి నిత్యాన్న దాన సత్రాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సందర్శించారు. అక్కడ నిరంతరంవండుతున్న భోజన ఏర్పాట్లను పరిశీలించి తక్కువ సమయంలో ఎక్కువ మందికి భోజనాలు ఏర్పాటు చేయడానికి కావాల్సిన సాంకేతిక పరిజ్ఞా నాన్ని, ఏర్పాట్లను పరిశీలించి ఆవిధంగా వనపర్తి జిల్లా బీఆర్ఎస్ భవనంలో నిరంతరం కార్యకర్తలకు భోజన ఏర్పాట్లు చేయడానికి పర్యవేక్షించడం జరిగింది. ఆయనవెంట జిల్లా పార్టీ శిక్షణ కార్యక్రమాలఅధ్యక్షులు మెంటపల్లి పురుషోత్తంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సురేందర్ పాల్గొన్నారు.

## గిరిజన ఆశ్రమ పాఠశాల తనిఖీ


గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న తనిఖీ బృందం

**ఖిల్లాఘణపురం,డిసెంబర్ 29 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను బుధవారం ట్రైబల్ వెల్ఫేర్ ప్యానెల్ హెడ్ టీం సభ్యులు జీహెచ్‌ఎం పి.శంకర్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మొత్తం 16 గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయని అన్నారు. అకాడమిక్ హెచ్‌ఎంటీవీ తనిఖీల్లో భాగంగా ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసి నివేదికను సిద్ధం చేస్తామని అన్నారు. అకాడమిక్ సంవత్సరం ప్రారంభం నుండి జనవరి 31 వరకు ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలోతనిఖీలు ఉంటాయని పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థులకు సంబందించిన రికార్డులు ఉపాధ్యాయులకు సంబందించిన రికార్డులను తనిఖీ చేసినట్లు వివరించారు. విద్యార్థులకు మెను ప్రకారంనాణ్యమైన భోజనంఅందించాలని సూచించారు. విద్యార్తుల కనీససామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు ఉన్న విద్యా ప్రమాణాలు అందించేలా ఉపా ధ్యాయులు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రధానఉపాధ్యాయురాలు శ్రీదేవి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## చెరువు కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న తుమ్మల అల్లోజీ

**బిజినేపల్లి,డిసెంబరు 29 ప్రభాతవార్త:** చెరువులలోని శిఖం భూములను కబ్జా చేసిన అక్రమా ర్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు తుమ్మల అల్లోజి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మత్స్యకార సహకార సంఘం భవనంలో గురు వారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజినేపల్లి గ్రామ శివారులోని మొద్దుల కుంట, సాకలోని చెరువు, ఈదుల్ చెరువులను ఆక్రమించుకుని సొమ్ము చేసుకున్నారని విమర్శించారు. ఎన్నోమార్లు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను కలిసి వినతి పత్రాలు అందజేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. చెరువులను సర్వేచేసి ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ల పరిధి నిర్ధారణ చేయాలని మండల సర్వసభ్య సమావేశంలో మత్స్యకార సహకార సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చామన్నారు. మండల ప్రజా ప్రతినిధులను ఎంపిపి, ఎంపిటిసిలు, మార్కెట్ కమిటి ఛైర్మన్లను కూడా కలిశామన్నారు. చెరువు కుంటలను ఆక్రమిస్తున్న నాయకులకు సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో జనవరి 2న సామరస్య శాంతియుత దీక్షను బిజినేపల్లి మండల ఎంపిడిఓ ఆఫీస్‌ఎదురుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల మత్స్య కార సహకార సంఘం అధ్యక్షుడు తుమ్మల అల్లోజీ, ఆంజనేయులు, శేఖర్, కంపిండ్ల లక్ష్మయ్య, కెబి శ్రీధర్, కె.నరసింహ, బి.ఈశ్వర్, కొండల్, మెట్టు శాంతయ్య, జి.తిరుపతయ్య, కంపిండ్ల వెంకట్రాములు, కె.రమేష్, శివ పాల్గొన్నారు.

## జాతీయస్థాయి సబ్ జూనియర్ రగ్బీ పోటీలలో ఈద్గాన్‌పల్లి శివప్రకాష్ అద్భుత ప్రతిభ


విద్యార్థినిని సన్మానిస్తున్న దృశ్యం

**రాజాపూర్,డిసెంబరు29 ప్రభాతవార్త:** జాతీయస్థాయి సబ్ జూనియర్స్ రగ్బీ పోటీలకు రాజాపూర్ మండలం ఈద్గాన్‌పల్లి గ్రామానికి చెందిన శివప్రకాష్ అద్భుత ప్రతిభ ప్రదర్శించిన సందర్భంగా గురువారం గ్రామ బిజెపి నాయకులు సన్మానించారు. ఈసందర్భంగా గ్రామ ఉపసర్పంచ్ వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ శివప్రకాష్‌ను తోటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని, గ్రామానికి మరెన్నో జాతీయస్థాయి పోటీలలో విజయం సాధించి తల్లిదండ్రులకు, గ్రామానికి, దేశానికి గొప్పపేరు తేవాలని అన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు ఉపసర్పంచ్ బూరం వెంకటేష్‌యాదవ్ ఆధ్వర్యంలో బాలగౌడ్, దారమోని శేఖర్, బాగం శ్రీశైలం, చంద్రప్రకాష్, జవాజి శ్రీను, జవాజి పర్వతాలు, మాధవులు, బాలకృష్ణ, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విస్తణోపాన్యాస




**వనపర్తి టౌన్,డిసెంబర్ 29 ప్రభాతవార్త:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల వనపర్తి సామాజిక శాస్త్రాలు, వాణిజ్య శాస్త్ర విద్యార్థులకు సమకాలిన భారత ఆర్థిక వ్యవస్థ స్థితిగతులు అనే అంశంపై విస్తరణోపాన్యాసం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ రిసోర్స్ పర్సెన్ గా విచ్చేసిన డా.ఎల్లకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, సిల్వర్ జూబ్లీ కళాశాల అటానమస్ కర్నూల్ నుండి నుండి విచేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి ప్రపంచ పరిస్థితులు, అంతర్గత పరిస్థితులకు అనుగణంగా మార్పుకు లోనవుతూ ప్రపంచీకరణ సరళీకరణ, ప్రైవేటీకరణ నుఅవలంబిస్తూ సర్వీసు రంగం యొక్క ప్రాముఖ్యతను పెంపొందిస్తూ మానవాభిద్రుద్ధి సంచికలో ఉన్నత స్థానం నిలుపుకోవలసిన అవసరం ఉందని కోవిడ్ అనంతర పరిస్థితుల వల్ల ఆన్‌లైన్ ఆర్థిక వ్యవస్థగా రూపొందిందని సమ్మిళిత ఆర్థిక వృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా.శ్రీనివాస్, అకాడమిక్ కో.ఆర్డినేటర్ సురేందర్ రెడ్డి, సామాజిక శాస్త్రాత ఇన్చార్జులు రఘునందన్, ఉమ, డా.రామ ఓబులేషు, వెంకటస్వామి, కురుమూర్తి, స్వప్న, ఆంజనేయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్గనైజర్ల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి



**ధరూర్,డిసెంబరు 29 ప్రభాతవార్త:** ధరూర్ మండలంలో అత్యధికంగా రైతులు విత్తన పత్తిని సాగు చేస్తున్నారు. అయితే కంపెనీలు నేరుగా రైతులకు ఫౌండేషన్ విత్తనాలు ఇవ్వకుండా మధ్యవర్తుల (ఆర్గనైజర్లు) ద్వారా రైతులతో విత్తన పత్తిని సాగు చేయిస్తూ, తిరిగి పంటను మధ్యవర్తుల ద్వారానే తీసుకునే క్రమంలో కంపెనీలు ఇచ్చే వాస్తవ ప్రయోజనాలను రైతులకు ఇవ్వకుండా మధ్యవర్తులు పలు రకాలుగా దోపిడి చేస్తూ, మోసం చేస్తున్నారని, జిఓటి (జెర్మినేషన్ ఆఫ్ టెస్టింగ్) ఫలితాలలో ఫెయిల్ కాకున్నా ఫెయిల్ అయినట్లు చెబుతున్న అలాంటి మధ్యవర్తులపై చర్యలు తీసుకుని ఈ దోపిడికి అడ్డుకట్ట వేయాలని, అలాగే ఫెయిల్ అయిన విత్తనాలకు రీ శాంపిల్ నిర్వహించాలని ధరూర్ మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆ శాఖ అధికారినికి ధరూర్ మండల అధ్యక్షుడు నెట్టెంపాడు గోవింద్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు నెట్టెంపాడు గోవింద్ మాట్లాడుతూ 2020, 21,2021,22కు సంబంధించి రైతులు సాగు చేస్తున్న విత్తనపత్తి పంటను చేతికిచ్చిన తర్వాత కంపెనీలు నిర్వహించే జిఓటి (జర్మినేషన్ ఆఫ్ టెస్టింగ్) ఫలితాలలో ఫెయిల్ కాకున్నా ఫెయిల్ అయినట్లు చెబుతూ కంపెనీల నుండి ఎలాంటి ధృవీకరణ పత్రాలు ఇవ్వకుండా దోపిడి చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి మండల ఉపాధ్యక్షుడు మునెప్ప, ప్రధాన కార్యదర్శి రాము, ఆర్గనైజింగ్ సెక్రటరీ శాంతన్న, నాయకులు సుదర్శన్, పరశురాం, జమ్మన్న, మహాలింగప్ప, శివన్న, రమేష్, నర్సింహులు, వెంకటన్న పాల్గొన్నారు.

# సామాజిక సేవలో ఆర్యవైశ్యులు ముందుంటారు..

**- ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ**
**- ఆర్యవైశ్య మహాసభ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ**


ఆర్యవైశ్య మహాసభ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం


ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,డిసెంబర్ 29, ప్రభాతవార్త:** సామాజిక సేవలో ఆర్యవైశ్యులు ముందుంటారని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ అన్నారు. గురువారం కొల్లాపూర్ పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో పట్టణంలోని ఆర్య వైశ్య సోదరులతో ఆర్యవైశ్య మహాసభ నూతన సంవత్సర 2023 క్యాలెండర్‌ను ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం అమ్మవారి ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బచ్చు రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆర్యవైశ్యులు సేవాభా వంతో ప్రతి సందర్భంలో ముందడుగు వేసి ప్రతి ఒక్కరికి అందు బాటులో ఉండి మానవ సేవే...మాధవ సేవ అనే విధంగా కార్యక్ర మాల్లో పాల్గొని తోటి వారికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఆర్య వైశ్య కులంలో కూడా పేద వారు ఉన్నారని, వారిని అభివృద్ధి పర్చేందుకు ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధించి ఆర్యవైశ్యుల అభివృద్ధే ధ్యేయంగా ముందడుగు వేస్తామన్నారు. ప్రభుత్వం ఎన్నో కులాల ప్రజలను అభివృద్ధి పర్చేందుకు కార్పొరేషన్లను ఏర్పాటు చేసిందని, కార్పొరేషన్ ద్వారా అందించే రుణాలతో ఎంతో మంది అభివృద్ధి చెందుతున్నారని, ఆర్యవైశ్యులు మాత్రం తమ సొంత పనులు చేసుకొని అభివృద్ధి దిశగా కొట్టుమిట్టాడుతూ ముందుకు సాగుతున్నారని, అలాంటి ఆర్యవైశ్యులనుఆదుకోవడానికి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. సమాజంలో ఎక్కడైన దైవ కార్యక్రమాలు, సామాజిక సేవలో ఆర్యవైశ్యులు ముందుండి కార్యక్రమాలను నిర్వహించి తమ వంతు సేవాభావాన్ని ప్రదర్శించి అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఆర్యవైశ్యులు సామాజిక సేవతో రాజకీయంగా అభివృద్ధిచెంది ఉన్నత పదవులను అవరోధించేందుకు కలిసి కట్టుగా ఏకతాటిపైకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కలిమిచెర్ల రమేష్, వెల్దండఆర్యవైశ్య సంఘంఅధ్యక్షులు ఆంజనేయులు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఆంజనేయులు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఆకుతోట సుదర్శన్ శెట్టి, ఆకుతోట శేషయ్య, అమరవాది స్వామి, ఆకుతోట రాజశేఖర్, వాసవీక్లబ్ జోనల్ ఛైర్మన్ అర్థం రవి, సోమిశెట్టి రాంప్రసాద్, కుంభం నరేష్, దినేష్ తదితరులు ఉన్నారు.

# నూతన కలెక్టరేట్‌లో బయోమెట్రిక్ విధానానికి వెంటనే సిద్ధం చేయాలి

**అన్ని కార్యాలయాల్లో ఫైళ్లు, సామాగ్రి ఒక పద్ధతి ప్రకారం అమర్చుకోవాలి: జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు**


నూతన కలెక్టరేట్‌లో జిల్లా అధికారుల కార్యాలయాలను పరిశీలిస్తున్న కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 29 ప్రభాతవార్త :** నూతన కలెక్టర్ కార్యాలయంలోకి మారిపోయిన అన్ని జిల్లా కార్యాలయాల అధిపతులు వారివారి కార్యాలయాలలోని సామాగ్రిని, ఫైళ్లను ఒక క్రమపద్ధతిలో ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఆదేశించారు. గురువారం ఆయన నూతన కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా అధికారుల కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా వైద్యారోగ్యశాఖ, ఎక్సైజ్, పౌర సరఫరాలు, ప్రాంతీయ రవాణా, పరిశ్రమలు, ఖాదీ, ట్రెజరీ, కార్మిక, హెచ్ సెక్షన్, జిల్లా ఇన్ఫర్మేటిక్ తదితర శాఖలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కలెక్టరేట్‌లోని ఉద్యోగుల కోసం ముందుగా బయోమెట్రిక్ విధానాన్ని తక్షణం ప్రవేశపెట్టాలని ఇందుకుగాను ఉద్యోగుల వివరాలను సేకరించి సిద్ధం చేయాలని జిల్లా ఇన్ఫర్మేటిక్ అధికారి మూర్తిని ఆదేశించారు. ఆయా కార్యాలయాల నుండి తీసుకువచ్చిన సామాగ్రి, ఫైళ్ల అన్నింటిని క్రమ పద్ధతిలో ఏర్పాటు చేసుకోవాలని, పాతబడిన, పాడుబడిన సామాగ్రిని తీసివేయాలని సూచించారు. అధికారులతో పాటు, సిబ్బందికి సైతం సరైన విధంగా సామాగ్రిని, కుర్చీలు ఏర్పాటు చేయాలని చెప్పారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## శబరిమలైకి ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు ప్రారంభం

**-నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**


నూతన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సును ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్29, ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్టీసీ ప్రయాణీకుల సౌకర్యం కోసం రెండు ఆధునిక కొత్త బస్సులు జిల్లా ప్రజలకు అందుబాటులో వచ్చాయని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ తెలిపారు. నూతన లగ్జరీ బస్సులో శబరిమలై యాత్రకు నాగర్‌కర్నూల్ పట్టణానికి చెందిన అయ్యప్ప స్వాములు గురువారం సాయంత్రం నాగర్‌కర్నూల్ అయ్యప్ప దేవస్థానం నుంచి 35 మంది అయ్యప్ప స్వాములు వారి కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా ఇరుముడులతో శబరిమలై బయలుదేరుతున్న బస్సును కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూర ప్రాంతాల ప్రయాణాలకు ఆర్టీసీ బస్సు భద్రత మరియు శ్రేయస్సుతో ఉంటుందన్నారు. శబరిమలైకి వెళ్లాల్సిన స్వాములు ఆర్టీసీ బస్సులను ఎంచుకోవడం ఉత్తమమన్నారు. ప్రతి ఒక్కరు ఆర్టీసీని ప్రోత్సహించి సంస్థ లాభాల్లో ప్రయాణించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం ధర్మసింగ్, ఆర్టీసీ ఇన్‌స్పెక్టర్ స్వామి, భాస్కర్, నారాయణ, గురుస్వామి లక్ష్మణ్, అయ్యప్పస్వాములు తదితరులు ఉన్నారు.

## ఐఎస్ఐ మార్క్ ఉన్న వస్తువులను వాడాలి

**-వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్

**వనపర్తి ప్రతినిధి,డిసెంబర్ 29 ప్రభాతవార్త:** ఐ.ఎస్.ఐ మార్క్ ఉన్న వస్తువులను మాత్రమే ప్రజలు వాడాలని, కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ సూచించారు. గురువారం ఐడిఓసీప్రజావాణిసమావేశ మందిరంలో బి.ఐ.ఎస్ జాయింట్ డైరెక్టర్ రాకేష్ తన్నీరుతో బ్యూరో ఆఫ్ ఇండియాన్ స్టాండర్డ్ శాస్త్రవేత్తలు, జిల్లా అధికారులతో కలిసి బి.ఐ.ఎస్ కేర్ అప్‌పై శిక్షణ కార్యక్రమంలో ఆయనపాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఒక వస్తువు కొనుగోలు చేసేటప్పుడు భారత ప్రమాణము గుర్తింపు పొందిన ఐ.ఎస్.ఐ హాల్ మార్కు ఉన్న వస్తువులను తనిఖీ చేసి తీసుకోవాలని ఆయన అన్నారు. ఆఫ్ ద్వారాఐ.ఎస్.ఐ మార్క్, లైసెన్స్ గడువు, లైసెన్స్ దారుని వివరాలు తెలుసుకోవచ్చునని ఆయన తెలిపారు. హెచ్.యు.ఐ.డీ నెంబర్‌తో హాల్ మార్కు గల ఆభరణాలు తీసుకెవచ్చునని వాటి విశ్వసనీయతను తెలుసుకోవచ్చునని, ఏదైనా ఉత్పత్తికి సంబందించిన భారతీయ ప్రమాణాలు, లైసెన్సులు, ప్రయోగశాలలో వివరాలు పొందవచ్చునని ఆయన తెలిపారు. సీ.ఆర్.ఎస్ నెంబర్‌తో ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ప్రామాణికతను తనిఖీ చేయవచ్చునని ఆయన అన్నారు. ఐ.ఎఫ్.ఐ చిహ్నం దుర్వినియోగం అయినట్లుయితే ఈ యాప్ ద్వారా ఉత్పత్తి నాణ్యత లోపాలపై ఫిర్యాదులు చేయవచ్చునని ఆయన సూచించారు. టెండర్ లకు సంబందించిన వాటిపై తప్పనిసరిగా ఐ.ఎస్.ఐ మార్కు ఉన్న వాటినే ఎంచుకోవాలని ఆయన సూచించారు. బి.ఐ.ఎస్‌కేర్ ఆప్‌పై జాయింట్ డైరెక్టర్ రాకేష్ తన్నీరు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఐ.ఎస్ఐ.మార్కు తదితర అంశాలను వివరించారు. ప్రజలు ఐ.ఎస్.ఐ మార్కు ఉన్న వస్తువులను మాత్రమే కొనుగోలు చేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు స్టాండర్డ్ ప్రమోటింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## షీ టీం ఆధ్వర్యంలో మహిళల రక్షణపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ మోహన్‌కుమార్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 29, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులోని జిల్లా పరిషత్ పాఠశాలలో డీఎస్పీ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో షీ టీం మరియు నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మోహన్‌కుమార్ మాట్లాడుతూ నేను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకొని ఉద్యోగం సంపాదించానని, మీరు కూడా బాగా చదువుకొని ఉన్నత హోదా తెచ్చుకోవాలన్నారు. విద్యార్థినులను లేదా మహిళలను ఎవరైన వేధింపులకు గురి చేస్తే వెంటనే షీ టీం నెంబరు 7901099455 లేదా 100కు ఫోన్ చేసి సమాచారమిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. మరియు సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. షీ టీం ఇన్‌చార్జి ఎఎస్ఐ విజయలక్ష్మి మాట్లాడుతూ తెలిసిన వ్యక్తుల ద్వారానే మహిళలు ఎక్కువగా వేధింపులకు గురవుతున్నారని, వారి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వీణారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, ఉపాధ్యాయ బృందం, చైల్డ్ ప్రొటెక్షన్ ఇన్‌చార్జి శ్రీశైలం, మధు, హెడ్ కానిస్టేబుల్ తక్కి ఖాన్, రాము, షీ టీం సభ్యులు వెంకటయ్య తదితరులు ఉన్నారు.

## నేడు బిత్తిరి సత్తి పలువురు కమెడియన్స్ రాక

**మ్యూజికల్ నైట్‌కు ముస్తాబవుతున్న గ్రౌండ్**
**30 వేలకు పైగా జన సమీకరణకు ఏర్పాట్లు**
**ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి**


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి

**రాజాపూర్,డిసెంబరు 29 ప్రభాతవార్త:** నూతన సంవత్సర వేడుకలు, తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని జడ్చర్ల కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి జడ్చర్ల పట్టణంలోని బూర్గుల రామకృష్ణారావు డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న మ్యూజికల్ నైట్ ప్రోగ్రామ్స్‌కు భారీ ఎత్తున ప్రజలు హాజరయ్యేందుకు గ్రౌండ్ సిద్ధం చేస్తున్నట్లు జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ కళాశాల ఆవరణలో కొనసాగుతున్న పనులను సుందరంగా తీర్చిదిద్దుతున్నామని, ఈ మ్యూజికల్ నైట్‌ప్రోగ్రాంకు 30 వేలకు పైగా జన సమీకరణ కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి టివి కమెడియన్స్, డ్యానర్సర్లు, సింగర్లు తదితరులు విచ్చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే దాదాపు 15 వేలకు పైగా పాసులు ఇచ్చామని, మిగతా పాసులు తన అభిమానులు ప్రజలకు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జడ్చర్ల నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన యువకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మ్యూజికల్ నైట్ కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలని ఈ సందర్భంగా జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి కోరారు.


మ్యూజికల్ నైట్‌కు ముస్తాబవుతున్న గ్రౌండ్

## బాధ్యతలు చేపట్టిన ఎస్సైకి సన్మానం



**లింగాల,డిసెంబరు 29 ప్రభాతవార్త:** బాధ్యతలు చేపట్టిన నూతన ఎస్సై శ్రీనివాస్‌కు పాత్రికేయులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నారాయణపేటలో విధులు నిర్వహించి బదిలీపై లింగాల పోలీస్ స్టేషన్‌లో బుధవారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన ఎస్సైకి గురువారం శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు సహకరించాలని కోరారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాత్రికేయులు సత్యనారాయణ, శ్రీనివాస యాదవ్, గోపినాయక్, రాజు, మన్నన్, వెంకటస్వామి, ఎస్. అశోక్, శ్రీనివాసులు, మన్సూర్, నసీర్ పాల్గొన్నారు.

## విజేతలకు ట్రోఫీ అందజేత

**ధరూర్ ప్రీమియర్ లీగ్ విన్నర్ డిఐ బ్లాస్టార్ రన్నర్ జెఎస్‌ఆర్ లయన్స్ టీం**


విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న దృశ్యం

**ధరూర్,డిసెంబరు 29 ప్రభాతవార్త:** ధరూర్ మండల కేంద్రంలో క్రికెట్ టోర్నమెంట్‌లో ఎనిమిది జట్లు పాల్గొనడం జరిగింది. ఒకటి డిఆర్ విజయ్‌కుమార్ వారియర్స్, రెండవది జెఎస్ఆర్ లయన్స్, మూడవది బిసిఎస్ ఆర్ గోల్డెన్ బ్లూస్, నాలుగవది పిఎస్ఆర్ పాంథర్స్, ఐదవది జెఎం స్ట్రైకర్స్, ఆరవది డివైఆర్ బ్రదర్స్, ఏడవది డి.ఎస్ రాయల్స్, ఎనిమిదవది డిఐ బూస్టర్స్ జట్లు పాల్గొన్నారు. ధరూర్ మండల కేంద్రంలోని డిఆర్ శ్రీధర్, డి.ఆర్ విజయ్‌కుమార్ స్థలంలోక్రిస్మస్ పండగ సందర్భంగా నిర్వహించిన ధరూర్ ప్రీమియర్ లీగ్ (డిపిఎల్) సీజన్ 1 క్రికెట్ టోర్నమెంట్‌లో డిఐ బ్లాస్టార్ విజేతగా రన్నర్‌గా జెఎస్ఆర్ లయన్స్ నిలిచాయి. మొదటి బహుమతి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి రూ.30 వేలు, రెండవ బహుమతి డిపిఎల్ మేనేజ్‌మెంట్ 20 వేలు, మూడవ బహుమతి డిపిఎల్ మేనేజ్‌మెంట్ 10వేలు బహుమతులను ధరూర్ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు డిఆర్ విజయ్‌కుమార్ ధరూర్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, డివై రామన్న, ధరూర్ మండలయూత్ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, గోవిందు, సతీష్, దర్శల్లి చేతుల మీదుగా అందజేశారు. విన్నర్, రన్నర్ మూడవ ట్రోఫీలను స్పాన్సర్ సంజీవ్ స్మాట్ బిఆర్ఎస్ యూత్ ప్రధాన కార్యదర్శి స్పాన్సర్ చేశారు. ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, బెస్ట్ కీపర్, బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్‌మెన్, మ్యాన్ ఆఫ్‌ది సిరీస్‌ట్రోఫీలను పోలీస్‌రవికుమార్ స్పాన్సన్ చేశారు. ఈసందర్భంగా బిఆర్ఎస్ పార్టీ ధరూర్ మండల అద్యక్షుడు డిఆర్ విజయ్‌కుమార్, ధరూర్ మాజీసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలలో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ఆడాలని క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తాయని ఓటమిని పట్టించుకోనవసరం లేదని, గెలుపుకు తొలి మెట్టు ఓటమి అని, అందరు స్నేహ పూర్వకంగా మెలగాలని భవిష్యత్‌లో ఇలాంటి క్రీడలకు సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో అన్నిజట్ల యజమానులు, డిపిఎల్ మేనేజ్‌మెంట్ క్రీడాకారులు, గ్రామ పెద్దలు, గ్రామప్రజలు, యువకులు, వివిధ గ్రామాల ప్రేక్షకులు పాల్గొన్నారు.

## ఆయా మండలాల ఉపాధ్యాయులకు సముదాయ సమావేశం



**లింగాల,డిసెంబరు 29 ప్రభాతవార్త:** ఆయా మండలాల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అంబటపల్లి పాఠశాలలో పాఠశాల సముదాయ సమావేశం నిర్వహించారు. ఈ సముదాయసమావేశానికి ఉప్పునుంతల, బల్మూరు, లింగాల మండలాల్లో పని చేస్తున్న భౌతిక రసాయనశాస్త్రం, జీవశాస్త్రంపైబోధించే ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సము దాయ సమావేశంలో ఎఫ్ఎ 1, ఎఫ్ఎ2, ఎస్ఎ1 పరీక్షల మార్కులు గ్రేడులు, ప్రయోగ నైపుణ్యాలు, అభ్యసన సామర్థ్యాలు మాదిరి పాఠ్య బోధన, మైక్రో టీచింగ్ తరగతులు, పదవ తరగతి పరీక్షాపత్రాలు తదితర అంశాలపైచర్చించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానో పాధ్యాయులు తాహెర్‌పాషా, ఆర్పీలు మురళీదర్‌రెడ్డి, సుబ్బయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.